18. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 281 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## ఢిల్లీ చేరుకున్న సిఎం రేవంత్

- పార్టీ నేత కెసి వేణుగోపాల్‌తో భేటీ



**న్యూఢిల్లీ, మార్చి17(వెలుతురు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. నేరుగా ఎఐసీసీ నూతన కార్యాలయం 'ఇందిరా భవన్'లో జనరల్ సెక్రటరీ కేసి వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. భేటీలో తెలంగాణ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు 2 లో..



## నందిని సిధారెడ్డికి సీఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2025 లభించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నందిని సిధారెడ్డికి శుభాకాంక్షలు

## కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

- గత ప్రభుత్వ పాపాలను మరచి మాట్లాడొద్దు
- ఏమేం చేశామో లెక్కలతో సహా వివరిస్తామన్న భట్టి



**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ మాట్లాడుతున్నంత సేపు మంత్రులు పలు అంశాల్లో తిప్పి కొట్టారు. గత హయాంలో చేసిన తప్పులు మరచి, ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. చేస్తున్న అభివృద్దిని అభినందించి, తగిన సూచనలు చేస్తే మంచిదని అన్నారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. 'పదేళ్ల అధికారంలో ఉండి మహిళా 2 లో..

## లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్ 2 లో..





## ఫిరాయింపులపై కెటిఆర్ ప్రస్తావన

- తీర్పు చదవకుండా వ్యాఖ్యలు సరికాదన్న స్పీకర్
- స్పీకర్‌ను తప్పుపడతారా అంటూ పొంగులేటి ఫైర్

**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్ పై స్పీకర్ తీర్పును కేటీఆర్ ప్రస్తావించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే దానం కాంగ్రెస్ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేశారని అన్నారు. దానం పార్టీ మారినట్లు ఆధారలు 2 లో..

## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం

- అభివృద్ధి ఎజెండాగా మా ప్రయాణం
- జాతీయ పార్టీగా ఢిల్లీకి వెళుతూనే ఉంటాం
- కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేటీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్‌గా మాట్లాడితే బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదన్నారు. మహిళలంటే ఎందుకు 10 లో..

## అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

- సిఎం రేవంత్‌ను తీసుకు వస్తా
- కెసిఆర్‌ను మీరు తీసుకు రావాలి
- మండలిలో మహేశ్ గౌడ్ ఆవేశపూరిత ప్రసంగం



**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం..అందుకు మీరు సిద్ధమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. 2 లో..

## సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

సిఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా

ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి

ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా

- గత గవర్నర్ ప్రసంగాలకు..నేటికి ఏం తేడా
- గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా
- ఐటి సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి
- ఢిల్లీకి వెళ్లి నిధులు తేకుండా..నిధులు ఇచ్చి వస్తున్నారు
- 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది
- కాంగ్రెస్ గ్యారెంటీలకు..ప్రభుత్వానికి జీరో వాల్యూ
- ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి
- తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కెటిఆర్ విసుర్లు



**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే 2 లో..

## రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి బాటలు

- 61 వేల మంది రైతులకు 'ఫార్మర్ కిట్ల' పంపిణీ ప్రారంభం
- రైతు నేస్తం 86వ ఎపిసోడ్ వేదికగా కార్యక్రమం
- ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని రైతులకు పిలుపు
- 20 నుండి 22 వరకు ఘనంగా 'రైతు మహోత్సవం'
- 22న నర్మెట్టలో సిఎం చేతుల మీదుగా రైతుభరోసా విడుదల
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**హైదరాబాద్,మార్చి17 వెలుతురు:** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు సచివాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ 2 లో..

## గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

- విలువలు,విశ్వసనీయత మీద పుట్టిన వైఎస్సార్‌సీపీ
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కూటమి
- మన పాలనలో క్యాలండర్ ప్రకారం హామీల అమలు
- గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి
- మనం మంచి చేశాం కనకనే ప్రతి ఇంట్లో పాలనపై చర్చ
- ఇక మిగిలి ఉన్నది రెండేళ్లే...చివరి ఏడాది ఎన్నికలు
- మధ్యలో నా పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం తెస్తా
- మరింత పట్టుదలగా మనం ప్రజల్లోకి వెళ్లగలగాలి
- ఒంగోలు పార్టీ కేడర్‌తో సమావేశంలో వైఎస్ జగన్



**అమరావతి,మార్చి17 వెలుతురు:** గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జగన్‌ది మాత్రమే కాదు.. వైఎస్సార్‌సీపీ అంతా కలిసి కట్టుగా నిర్మించుకున్నాం. వైఎస్సార్‌సీపీ 2 లో..

## అబద్దాలు, సెటైర్లు వేయడం మానుకో

- మహిళలకు ఎవరేం చేశారో వారినే అడుగుదాం
- అసెంబ్లీలో కెటిఆర్‌కు కౌంటర్ ఇచ్చిన సీతక్క 2 లో..




## అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చిన పాక్ ప్రభుత్వం 10 లో..

## కాంగ్రెస్‌లో చిచ్చు పెడుతున్నదే ఎమ్మెల్యే సంజయ్

- తనతో కలసి పనిచేయాలనడానికి ఆయన ఎవరు?
- ఇంతకు ఆయన ఏ పార్టీకి చెందిన వారో చెప్పాలి
- నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ బంధాన్ని తెంపే కుట్ర
- తాను పార్టీ మారితే అందుకు కారణం సంజయ్ మాత్రమే
- మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**జగిత్యాల,మార్చి17 వెలుతురు:** తనను కాంగ్రెస్ నుంచి బయటకు పంపించేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను ఎవరో వెనక ఉండి ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి 10 లో..

## మీ సాయం మాకక్కర లేదు..

- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక




10 లో..

## రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

- మరో 15 రోజులకు అవసరమైన నిల్వలు
- త్వరలోనే మరింత గ్యాస్ సరఫరా
- కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ పెంచాలి
- ప్రజలు పానిక్ కాకుండా చైతన్య పరచాలి
- అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు సూచన
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల

10 లో..



వెలుతురు

## అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు సిగ్గు చేటని, బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## నందిని సిధారెడ్డికి సీఎం రేవంత్ అభినందనలు

తెలియజేశారు. కరోనా మహమ్మారి కాలంలో మానవాళి ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను అనిమేష కవితా సంపుటిలో హృద్యంగా తెలియజేసిన మానవతావాది సిధారెడ్డి అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అక్షరాలను ఆయుధాలుగా మలిచి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని వ్యాప్తి చేసిన ఘనత సిధారెడ్డికి దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పలు కవితా సంపుటాలు, రచనలతో ఆధునిక తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్తల్లో సిధారెడ్డి ముందువరుసలో ఉన్నారని సీఎం తెలిపారు.

## కెటిఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు

సాధికారతను గాలికి వదిలేశారు. మీ ఇంటి ఆడబిడ్డపై మీకు ఏ గౌరవం ఉందో రాష్ట్రమంతా చూస్తోంది. కానీ రాష్ట్ర మహిళల గౌరవంపై చిన్న చూపు వద్దు. రాష్ట్రాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచన మంచిది కాదని భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదని బీఆర్ఎస్ ఆరోపించడం సరికాదని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ది చేకూరుతుందనేది లెక్కలతో చెబుతామని తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని వివరించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పకుండా ప్రభుత్వాన్ని కేటీఆర్ విమర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందరికీ ఇస్తామన్నారు.. ఇచ్చారా అని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. రూ.22,500 కోట్లతో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో వేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఇవ్వకుండా వదల్లేదు. మూడు ఎకరాలు ఇస్తామని ఇవ్వకుండా వదిలేయలేదు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మోసం చేయలేదు. మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే ఈ పనులన్నీ చేస్తున్నాం' అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఫిరాయింపులపై కెటిఆర్ ప్రస్తావన

లేవని స్పీకర్ తీర్పు చెప్పడాన్ని తప్పుబట్టారు. అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన స్పీకర్.. కేటీఆర్ జడ్జిమెంట్ మొత్తం చదవకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తనపై విమర్శలు చేసిన ప్రతీ సారి మీడియా ముందుకు వచ్చి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఉన్నత పదవిలో ఉన్న తనను అవమానించడం కరెక్ట్ కాదన్నారు. పార్టీ ఫిరాయింపులపై జడ్జిమెంట్ కాపీ పూర్తిగా చదివి మాట్లాడాలని కేటీఆర్‌కు సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్ నే ప్రశ్నించడం కరెక్ట్ కాదన్నారు. బీఆర్ఎస్ నిజాయితీగా ఉంటే ఎందుకు ఎన్నికల్లో ఓడిపోతుందని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని ఫైర్ అయ్యారు. అధికారంలో ఉన్నపుడు ఒకలా..ప్రతిపక్షంలో ఉన్నపుడు మరో విధంగా మాట్లాడటం కేటీఆర్ కే చెల్లుతుందన్నారు. కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్టీ ఫిరాయింపుల గురించి మీ నాన్నను అడగాలంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని అడిగి తెలుసుకోవాలని సూచించారు.

## ఢిల్లీ చేరుకున్న సిఎం రేవంత్

సమాచారం. ఇకపోతే తాజా రాజకీయాలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలపైనా చర్చించారని తెలుస్తోంది. తెలంగాణ నుంచి కూడా పలువురు నేతలు ప్రచారంలో పాల్గొనబోతున్నారు. ఇందులో సిఎం రేవంత్ కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు కేసి వేణుగోపాల్‌కి వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**

తెలంగాణ లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆహుతులను స్వయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇక్కడికి విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవాని పరివార్ సభ్యులకు మరియు కళాకారులకు పేరు పేరున నాహృదయపూర్వక నమస్కారములు అని అన్నారు. మీ అందరికీ శ్రీ 'పరాభవ' నామసంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ నూతన సంవత్సరం మీ కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం.. పరాభవ అంటే.. మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం అని గవర్నర్ శుక్లా ఆకాంక్షించారు. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఉగాది అంటేనే కొత్త శకం. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్ట సుఖాల కలయికను సూచిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.

# రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి బాటలు

ఎపిసోడ్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసిన రంగరెడ్డి జిల్లాకు చెందిన రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్లను' అందజేసి రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు వాతావరణం కలుషితం అవుతున్న తరుణంలో, మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతులకు, సమాజానికి క్షేమకరమని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, ఒక్కో క్లస్టర్ నుండి 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులను ఈ పథకం కోసం ఎంపిక చేశారు. వీరికి అవగాహన తో పాటుగా ఫార్మర్ కిట్లను అందజేశారు. 20, 21, 22 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. 50కి పైగా స్టాల్స్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉంటుందని అన్నారు. 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా యాసంగి సీజన్ రైతు భరోసా నిధుల జమ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ల్గ÷తులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ అధిక ఆదాయాన్ని గడించాలని మంత్రి ఆకాంక్షించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమంలో లక్ష్యానికి మించి 110శాతం నమోదు చేసి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలచి కేంద్ర ప్రభుత్వం ద్వారా 422.64 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకం పొందడంలో కీలక పాత్ర పోషించిన వ్యవసాయ విస్తరణ అధికారులు మండల వ్యవసాయ అధికారులు సహాయ సంచాలకులు జిల్లా వ్యవసాయ అధికారులను ఈ సందర్భంగా మంత్రి భినందించారు ప్రకృతి వ్యవసాయం రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని సూచించారు. రూ42 కోట్లతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు, దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 489 క్లస్టర్లు దాదాపు 61,125 ఎకరాలలో ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానంలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికా చేయడం జరిగిందని అందుకు గాను 61,125 మంది రైతులను ఎంపిక చేసి రైతు వేదికలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని తెలియజేసారు. అంతే గాక వీరికి సాగులో మరియు మార్కెటింగ్ లో తోడ్పడే విధంగా కృషిసఖి లను క్లస్టర్ కు ఇద్దరు చొప్పున నెలకి 5000 గౌరవ వేతనం ఇచ్చి నియమించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన బీజామృతం, జీవామృతం, దశపర్ణి వంటి జీవ ఉత్పాదకాలు స్వయంగా తయారు చేసుకోలేని రైతుల కోసం ప్రభుత్వం జీవ ఉత్పాదక తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందుకు రూ లక్ష కేటాయించినట్లు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నర్మెట్టలో రైతు మహోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవంలో వ్యవసాయ, పశుసంవర్ధక మరియు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే దాదాపు 150 ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22న నర్మెట్టలో ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా మొదటి విడుత రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 20,600/- కోట్ల రైతు రుణమాఫీ ఒకే దఫాలో విడుదల చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు.అంతేగాక గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ లో 9 రోజులలో 9000/- కోట్లు రైతు ఖాతాలలో జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది అని అన్నారు. అదేవిధంగా నూనె గింజలు, పప్పు దినుసులు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయం అందించడంలో సహకరిస్తుందని, ప్రకృతి విపత్తులు, పక్షులు, జంతువుల వల్ల కలిగే నష్టాలు తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి , తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, వ్యవసాయ సంచాలకులు బి. గోపి పాల్గొన్నారు

# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది?తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టారో చెప్పాలన్నారు.కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్దాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

విలువలు,విశ్వసనీయత మీద పుట్టింది. అదే పునాదుల మీద కొనసాగుతోంది. గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్.మనం మంచి చేశాం. కాబట్టే ప్రజలతో కలిసి ముందుకెళ్తున్నాం. మన పాలనకు, బాబు పాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించారు. ప్రతి ఇంట్లోనూ ఇదే చర్చ జరుగుతోందన్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కేడర్‌తో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. వైఎస్ జగన్ భేటీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, పార్లమెంటు ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. అవినీతి కోసం మాత్రమే వాళ్లు అధికారంలో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. మనం అధికారంలోకి వచ్చినప్పుడు అద్భుతమైన రాష్ట్రాన్ని ఇచ్చినట్లు బాబు బిల్డప్. వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసి అప్పగించారు. కేవలంలో ఖజానాలో రూ.100కోట్లు మాత్రమే ఉంచారు. తర్వాత కోవిడ్ లాంటి కష్టాలు ఎదుర్కొన్నాం. ఆర్థికంగా ఒత్తిళ్ల మధ్య మన పరిపాలన సాగింది. ప్రజలకు ఇచ్చిన మాటను ఎప్పుడూ వదిలి పెట్టలేదు. దేశ చరిత్రలో జరగని విధంగా హామీలు అమలు చేశాం. ముందుగానే క్యాలండర్ ఇచ్చి హామీలను అమలు చేశాం. బడ్జెట్‌లో క్యాలెండర్ పెట్టి పథకాలు అమలు చేశాం. పేదలను, మధ్యతరగతి ప్రజలను ఆదుకున్నాం. మన హయాంలో రూ.3.31లక్షల కోట్లు అప్పు చేస్తే రూ.2.7లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో వేశాం. రెండేళ్లకే చంద్రబాబు కమిటెడ్ అప్పులు.. గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి. చంద్రబాబు హామీలు మోసాలుగా తేలిపాయా యని వైఎస్ జగన్ అన్నారు. 'మన పథకాలన్నీ చంద్రబాబు నాయుడు రద్దు చేశారు. ఈ డబ్బులన్నీ ఎవరి జేబులోకి వెళ్లిపోయాయి. జగన్ ఏం చేయగలిగాడు. బాబు ఎందుకు చేయలేక పోతున్నాడని చర్చిస్తున్నారు. అవినీతికి తావు లేకుండా మనం పథకాలు అమలు చేశాం. ఇప్పుడు దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇదే కొనసాగుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు. అమరావతి పనుల్లో తీవ్రమైన అవినీతి. భూములను శెనక్కాయలకు, బెల్లానికి ఇచ్చేస్తున్నారు. ఏపీలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డారు. పార్లమెంటు చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ ఆయనే. ఇలాంటి వాటిపట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరు దారుణం అన్నారు. చంద్రబాబు ఒక పాలకుడిగా వ్యవహరించడం లేదు. మోసం చేశారని బాధితురాలు సీఎంకు ఫిర్యాదు చేస్తే కమిటీలు వేస్తామంటున్నారు. ఆదిమూలం మహిళపై లైంగిక దాడి చేస్తే పంచాయతీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపల్‌పై వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై నో యాక్షన్. మహిళలకు అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్ అన్నారు. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీద నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీద కూడా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా నో యాక్షన్. ఆదినారాయణరెడ్డి కొడుకు డ్రగ్స్‌తో పట్టుబడితే నో యాక్షన్. తన కొడుకు స్విమ్మింగ్? పూల్స్? వద్ద తాగుతు, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తే నో యాక్షన్ అన్నారు. తన బావమరిది మహిళలపై నీచంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని బాబు అన్నారు. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు. చంద్రబాబుకు ఇక మిగిలింది రెండేళ్లే. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికలున్నాయి. మధ్యలో నా పాదయాత్ర కూడా ఉంటుంది. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట. కార్యకర్తల ద్వారానే ప్రజలకు మరింత మంచి' అని అన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, వాటిలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఒక్కరిది కాదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రేమించే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిర్మించిన పార్టీ అని జగన్ పేర్కొన్నారు. పార్టీ విలువలు, విశ్వసనీయత మీదే పుట్టిందని.. అదే పునాదులపై ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. గత 16 సంవత్సరాల్లో ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశామని, గుండెధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్ జగన్ చెప్పారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేశామని తెలిపారు. మేనిఫెస్టోను కచ్చితంగా పాటిస్తూ ముందుగానే క్యాలెండర్ ప్రకటించి పథకాలను అమలు చేసినట్టు గుర్తు చేశారు. ఆర్థిక ఒత్తిళ్లు, కోవిడ్ వంటి సంక్షోభాల మధ్య కూడా పేదలు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచామన్నారు. వైసీపీ హయాంలో తీసుకున్న అప్పుల్లో పెద్ద భాగాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లోకి పంపించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. సీఎంచంద్రబాబు హామీలను నిలబెట్టుకోలేకపోయారని వైఎస్ జగన్ ఆరోపించారు. రెండేళ్లలోనే భారీ అప్పులు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని వినియోగించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ పథకాలను రద్దు చేసి ప్రజలను నిరాశపరిచారని అన్నారు. అమరావతి అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదని, దోపిడీ పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. ఈ సందర్భంగా చుండూరు రవికి తన పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలతో మరింత దగ్గరగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని జగన్ సూచించారు.

## అబద్దాలు, సెటైర్లు వేయడం మానుకో

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**

మహిళలంటే మాజీ మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులైనా, బయట మహిళలనైనా ఎదగనీయాలంటూ కేటీఆర్‌కు మంత్రి చురకలంటించారు. ఫ్రీ బస్‌పై కేటీఆర్ సెటైర్లు, తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు, ఎగతాళి మాటలు బంద్ చేయాలన్నారు. పదేళ్ళు మంత్రిగా మహిళల కోసం కేటీఆర్ ఏం చేశారని సీతక్క ప్రశ్నించారు. మహిళా సంఘాలు ఐదు లక్షల కంటే ఎక్కువ తీసుకోకుండా బారికేడ్లు పెట్టారని.. ఇప్పుడు ఆ బారికేడ్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయో వెళ్లి మహిళలను అడగాలని మంత్రి సవాల్ చేశారు. అభయ హస్తం డబ్బులను కూడా గత ప్రభుత్వం వాడుకుందని సీతక్క ఆరోపించారు. శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తున్నామని మంత్రి వివరించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. కేటీఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలపై రూ.3000 కోట్ల భారం పెట్టిపోయిందన్నారు. కేటీఆర్ ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని అంటూ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





**హైదరాబాద్ వెలుతురు మార్చి 17:**
జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఞఖఔజీ), తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TUWJF) సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో కానీ అక్కడేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముందు రైతుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఏమ్మెల్యేలు, ఏమ్మెల్సీలు నిరసన





**హైదరాబాద్ వెలుతురు మార్చి 17:**
రాష్ట్రంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలకు ముందు, శాసనసభ పక్ష ఉపనేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నేతృత్వంలో రైతులతో కలిసి ప్రత్యేకంగా నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు సమర్పించిన సుమారు లక్ష దరఖాస్తులను రిక్షా బండి మీద మరియు తలపై మోసుకుంటూ, గన్ పార్క్ వరకు కాలి నడకన వెళ్లి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కీలక డిమాండ్లు వినిపించారు. రాష్ట్రంలో వెంటనే ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని, రైతన్నలకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని, అలాగే రైతుభరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి , బీజేపీ ఎమ్మెల్యేలు రామారావు పాటిల్, హరీష్ బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, అలాగే ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి పాల్గొని రైతుల డిమాండ్లకు మద్దతుగా నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమం అనంతరం బీజేపీ ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు.




# ఇరాన్ సెగ.. మన వంటింట్లో మంటలు ఆరిపోతాయా?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*ప్రస్తుతం ప్రపంచపటం వైపు చూస్తే మధ్యప్రాచ్యం (Middle East) ఒక అగ్నిపర్వతంలా కనిపిస్తోంది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న రణహోమం కేవలం సరిహద్దులకే పరిమితం కాలేదు. తుపాకుల మోత అక్కడ వినిపిస్తుంటే, ఆ సెగ ఇక్కడ మన వంటింట్లోని గ్యాస్ స్టవ్ వరకు తాకుతోంది. అవును, మీరు విన్నది నిజమే! ఇరాన్ గడ్డపై పడుతున్న ప్రతి బాంబు ప్రతిధ్వని మన దేశంలోని సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతోంది. ఇది కేవలం అంతర్జాతీయ రాజకీయాల చదరంగం కాదు మన నిత్యజీవితాన్ని అతలాకుతలం చేసే ఆర్థిక సంక్షోభానికి నాంది. భారత్‌లో LPG (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) సిలిండర్ ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయి? అసలు ఇరాన్ పరిస్థితికి, మన వంటగదికి ఉన్న ఆ విడదీయలేని బంధం ఏమిటి?ముందుగా మనం ఇరాన్ భౌగోళిక ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి.*

ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలు ఉన్న దేశాల్లో ఇరాన్ నాలుగో స్థానంలో ఉంది. కానీ ఇక్కడ అసలు మలుపు 'హార్ముజ్ జలసంధి' (Strait of Hormuz). పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉండే ఈ ఇరుకైన సముద్ర మార్గం ద్వారానే ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో సుమారు 20 శాతం రవాణా అవుతుంది. గణాంకాల ప్రకారం, ప్రతిరోజూ దాదాపు 2 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంది. ఒకవేళ ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ముదిరి, ఇరాన్ గనుక ఈ జలసంధిని మూసివేస్తే, ప్రపంచం మొత్తం చీకట్లోకి వెళ్లక తప్పదు. చమురు సరఫరా ఆగిపోయి, డిమాండ్ పెరిగి ధరలు నియంత్రణ కోల్పోతాయి. భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 87 శాతాన్ని దిగుమతుల ద్వారానే తీర్చుకుంటుంది. మనకు ప్రధానంగా సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ, కువైట్ వంటి గల్ఫ్ దేశాల నుండే ఇంధనం వస్తుంది. ఈ దేశాల నుండి వచ్చే ట్యాంకర్లన్నీ హార్ముజ్ జలసంధిని దాటుకునే రావాలి. అంటే, అక్కడ యుద్ధం జరిగితే మన దేశంలో పెట్రోల్, డీజిల్ మాత్రమే కాదు, మన ఇంటి సిలిండర్ కూడా బంగారం అయిపోతుంది. చాలామందికి ఒక సందేహం ఉంటుంది. చమురు ధర పెరిగితే గ్యాస్ ధర ఎందుకు పెరుగుతుందని? LPG అనేది విడిగా దొరికేది కాదు,అది ముడి చమురును శుద్ధి చేసే ప్రక్రియలో (Refining) వచ్చే ఒక ఉప ఉత్పత్తి. ఇందులో ప్రొపేన్, బ్యూటేన్ అనే వాయువుల మిశ్రమం ఉంటుంది. కాబట్టి అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర ఒక్క డాలర్ పెరిగినా, దాని ప్రభావం నేరుగా ఞా+ పై పడుతుంది. ఇప్పటికే గత ఏడాదితో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్ ధరలు 18 నుంచి 22 శాతం వరకు పెరిగాయి. యుద్ధం గనుక తీవ్రమైతే, బ్యారెల్ ధర 120 డాలర్ల నుండి 150 డాలర్లకు చేరుకోవచ్చని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత ప్రభుత్వం ప్రస్తుతం పీఎం ఉజ్జ్వల యోజన ద్వారా కోట్ల మందికి సబ్సిడీ ధరకే గ్యాస్ అందిస్తోంది. కానీ అంతర్జాతీయ ధరలు భారీగా పెరిగినప్పుడు, ప్రభుత్వం ఆ భారాన్ని ఎంతకాలం మోయగలదు? గతంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వచ్చినప్పుడు కూడా మనం చూశాం సిలిండర్ ధర ఒక్కసారిగా రూ. 200 పైగా పెరిగింది. ఇప్పుడు మధ్యప్రాచ్యంలో యుద్ధం జరిగితే, ఆ పాత రోజులు మళ్ళీ వచ్చే ప్రమాదం పొంచి ఉంది. యుద్ధం అంటే కేవలం ప్రాణనష్టం కాదు, అది వాణిజ్యానికి ఒక పెద్ద అడ్డంకి. యుద్ధ మేఘాలు కమ్ముకున్నప్పుడు సముద్ర మార్గాల్లో ప్రయాణించే ట్యాంకర్లకు ఇన్సూరెన్స్ కంపెనీలు భీమా ఇవ్వడానికి వెనుకాడుతాయి. భీమా ప్రీమియంలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు (Freight charges) రెండు మూడు రెట్లు పెరుగుతాయి. ఈ భారమంతా చివరికి వినియోగదారుడి నెత్తినే పడుతుంది. అంతేకాకుండా, ఒకవేళ యుద్ధం ముమ్మరమైతే ఇరాన్ తన చమురు మౌలిక సదుపాయాలను కాపాడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తుంది. పొరుగున ఉన్న సౌదీ, కువైట్ చమురు క్షేత్రాలపై దాడులు జరిగితే సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. మన దేశంలోని IOC, HPCL, ద్రీజూ వంటి సంస్థలు నిల్వలు పెంచుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఫలితంగా మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడి, బుక్ చేసినా నెలకు పైగా నిరీక్షించాల్సిన దుస్థితి రావచ్చు.అయితే, గడచిన దశాబ్ద కాలంలో భారత్ తన ఇంధన భద్రత విషయంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. విశాఖపట్నం, మంగళూరు, పాదూర్ వంటి ప్రాంతాల్లో భూగర్భంలో స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ (SPR)లను నిర్మించింది. ఇవి అత్యవసర పరిస్థితుల్లో దాదాపు 9 రోజుల పాటు దేశ అవసరాలను తీర్చగలవు. కానీ ఇది ఒక తాత్కాలిక ఊరట మాత్రమే.మరోవైపు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ తెలివిగా రష్యా నుండి తక్కువ ధరకే చమురును దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం మన మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా 35-40 శాతానికి చేరింది. ఇది గల్ఫ్ దేశాలపై మనకున్న ఆధారితాన్ని కొంతవరకు తగ్గించింది. కానీ రష్యా నుండి వచ్చే చమురు కూడా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రావాల్సి ఉంటుంది, ఇది ఖర్చుతో కూడుకున్న పని.ఒక సాధారణ భారతీయ మధ్యతరగతి కుటుంబానికి నెలకు ఒకటి లేదా రెండు సిలిండర్లు అవసరం. ప్రస్తుతం సిలిండర్ ధర రూ. 850-900 మధ్య ఊగిసలాడుతోంది. పరిస్థితులు చేయి దాటితే ఇది రూ. 1,500 వరకు వెళ్లవచ్చని అంచనా. ముఖ్యంగా పేద మహిళలకు ఇది పెను భారంగా మారుతుంది. గ్యాస్ దొరకని పరిస్థితుల్లో మళ్ళీ పాత కాలపు కట్టెల పొయ్యిల వైపు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇది మహిళల ఆరోగ్యానికే కాదు, అడవుల నరికివేత వల్ల పర్యావరణానికి కూడా చేటు చేస్తుంది. అగ్నికి ఆజ్యం పోసినట్లు, గ్యాస్ కొరతను సాకుగా తీసుకుని బ్లాక్ మార్కెట్ ముఠాలు రెచ్చిపోయే అవకాశం కూడా ఉంది.ప్రభుత్వ పరంగా చూస్తే, గోబర్ధన్ వంటి పథకాల ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడం, సోలార్ కుక్కర్లు మరియు ఇండక్షన్ స్టవ్‌లను ప్రోత్సహించడం అత్యవసరం. ఇంధన స్వయంసమృద్ధి సాధించకపోతే, ఇలాంటి అంతర్జాతీయ యుద్ధాలు మనల్ని దెబ్బతీస్తూనే ఉంటాయి.




వ్యక్తిగత స్థాయిలో కూడా మనం కొన్ని మార్పులు చేసుకోవాలి, ప్రెషర్ కుక్కర్ వాడకం, తక్కువ నీటితో వండటం వంటి చిన్న చిట్కాలు సిలిండర్ ఆయుష్షును పెంచుతాయి. కరెంట్ కోతలు లేని ప్రాంతాల్లో ఇండక్షన్ స్టవ్‌లను వాడటం వల్ల గ్యాస్ వినియోగాన్ని తగ్గించవచ్చు. పండగలు, శుభకార్యాల సమయంలో గ్యాస్ బుకింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.ఇరాన్‌తో భారత్‌కు కేవలం చమురు సంబంధాలే లేవు, చారిత్రక బంధం ఉంది. చాబహార్ పోర్ట్ ప్రాజెక్ట్ మనకు వ్యూహాత్మకంగా ఎంతో ముఖ్యం. అటు అమెరికా ఒత్తిడి, ఇటు ఇరాన్‌తో స్నేహం వీటి మధ్య భారత్ స్ట్రాటజిక్ ఆటోనమి (Strategic Autonomy) అనే సమతూకాన్ని పాటిస్తోంది. రష్యా నుండి చమురు కొంటూనే, అమెరికాతో రక్షణ ఒప్పందాలు చేసుకోవడం మన దౌత్య విజయమే. కానీ యుద్ధం గనుక పూర్తిస్థాయిలో వస్తే, ఈ సమతూకం దెబ్బతినే ప్రమాదం ఉంది.మధ్యప్రాచ్యంలో యుద్ధం అంటే అది కేవలం బాంబుల మోత కాదు, అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒక సునామీ. దేశంలో 33 కోట్ల మంది ఞా+ వినియోగదారులు ఉన్నారు. సిలిండర్ ధర రూ. 500 పెరిగినా, సగటున ఒక కుటుంబంపై ఏడాదికి రూ. 6,000 అదనపు భారం పడుతుంది. ఇది సామాన్యుడికి నెల జీతంతో సమానం.ఇరాన్ ఆకాశంలో పొగలు కమ్ముకుంటున్నాయి. ఆ పొగ మన వంటిళ్లను కప్పేయకముందే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ప్రజలు కూడా ఇంధన వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. యుద్ధం ఎక్కడో జరుగుతుండవచ్చు, కానీ దాని ప్రభావం మన కంచంలో ఉంది. మేల్కొందాం సిద్ధమౌదాం!

# డిజిటల్ యుగంలో నిజనిర్ధారణకు దిక్సూచిగా మారిన ఏఐ

- ఏఐతో తయారు చేసిన కంటెంట్ తీవ్ర సమస్యగా పరిణమిస్తోన్న తరుణంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది: సంగారెడ్డి కలెక్టర్ పీ ప్రావీణ్య
- వార్తల నిజనిర్ధారణలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం కీలకంగా వ్యవహరిస్తోంది: పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్
- బాధ్యతాయుతమైన ఏఐ వినియోగం, ఫ్యాక్ట్ చెకింగ్‌పై పీఐబీ వర్క్‌షాప్





**సంగారెడ్డి జిల్లా 2026, మార్చి 17:**
సంగారెడ్డి జిల్లాలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ విభాగం ఈ రోజు వార్తాలాప్ వర్క్‌షాపును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లింగ వివక్ష సమస్యలు, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాత్రికేయంలో కృత్రిమ మేధ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథి, విశిష్ట అతిథులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాపులో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు130 మంది పాత్రికేయులు పాల్గొన్నారు. వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కచ్చితమైన, అధికారిక సమాచారాన్ని ప్రసారం చేయడంలో పీఐబీ పోషిస్తున్న పాత్ర గురించి పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) శ్రీమతి శ్రుతి పాటిల్ వివరించారు. కృత్రిమ మేధ వినియోగం బాగా పెరిగిన ఈ రోజుల్లో వార్తల్లోని నిజానిజాల నిర్ధారణలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం కీలకంగా వ్యవహరిస్తోందని ఆమె తెలిపారు. "తప్పుడు వార్తలను గుర్తించి సరైన సమాచారాన్ని నిష్పక్షపాతంగా ప్రసారం చేయడానికి ఆధునిక సాధనాలు, ఏఐను ఎలా వినియోగించుకోవాలో వార్తాలాప్ శిక్షణ ఇస్తుంది. విలేకరుల రిపోర్టింగ్ ప్రమాణాలను ఈ కార్యక్రమం మెరుగుపరుస్తుంది" అని ఆమె అన్నారు. డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం గురించి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య వివరించారు. ఏఐ ఉపయోగించి తయారు చేసిన కంటెంట్, తప్పుదోవ పట్టించే విజువల్స్, అసత్య సమాచారం తీవ్రమైన సమస్యలుగా పరిణమిస్తున్నాయని తెలిపారు. "ఒక చిన్న తప్పుడు సమాచారం కూడా సమాజంపై, ఆర్థిక వ్యవస్థపై, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది. వార్తాలాప్ తరహా శిక్షణ కార్యక్రమాలు జర్నలిస్టుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తాయి" అని అన్నారు. లింగ సమానత్వం, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల వివరించారు. లింగ సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని, ఈ తరహా ఆలోచనాధోరణిని పెంపొందించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇలాంటి సమస్యలపై వార్తల ద్వారా అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని ఆమె వివరించారు. నోట్‌బుక్ ఎల్ఎల్ఎం, చాట్‌జీపీటీ, గూగుల్ పిన్ పాయింట్, ఎలెవన్ ల్యాబ్స్, జెమినీ ఏఐతో సహా జర్నలిజంలో ఏఐ సాధనాల వినియోగం గురించి శ్రీమతి సత్య ప్రియ వివరించారు. తప్పుడు సమాచారాన్ని గుర్తించి, తమ రిపోర్టింగులో కచ్చితత్వాన్ని పెంపొందించుకొనేందుకు ఆధునిక సాంకేతికతలను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలన్నారు. అలాగే ఏఐ వేదికల ద్వారా వ్యక్తిగతమైన, సున్నితమైన అంశాలను పంచుకోవద్దని హెచ్చరించారు. ప్రశ్నలు-సమాధానాలతో వర్క్‌షాపు ముగిసింది. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు ఏడీజీ సమాధానమిచ్చారు. వారి అభిప్రాయాలను మంత్రిత్వశాఖకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ చర్యలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సహాయక కార్యక్రమాలు, పథకాల గురించి ఏడీజీ వివరించారు.



# సంపాదకీయం..

# సమాజానికి చీడలా..డ్రగ్స్ మహమ్మారి !



ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్‌ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత శనివారం రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి.

రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.

## కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

- అఫ్ఘానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి
- పాక్ తీరును తీవ్రంగా తప్పుపట్టిన భారత్



న్యూఢిల్లీ,మార్చి17( వెలుతురు):
అఫ్ఘానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్ఘానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఎ÷–గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

## మరోమారు భగ్గుమన్న పసిడి ధర

- సగటున పది గ్రాములపై 1200 పెరుగుదల

న్యూఢిల్లీ,మార్చి17 ( వెలుతురు):
గత కొంతకాలంగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు మంగళవారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.1200ల మేర పెరిగింది. వెండి ధర కూడా సగటున రూ.5 వేల మేర ఎగబాకింది. ధరలు దిగివచ్చినప్పుడు వందల్లో దిగుతూ..పెరిగితే వేలల్లో పెరగడం గమనార్హం. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,58,620లకు ఎగబాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.1200ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.1100ల మేర పెరిగి రూ.1,45,400కు చేరుకుంది. నగరంలో వెండి ధర రూ.4 వేల మేర పెరిగింది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.8 లక్షలు పలుకుతోంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,820గా ఉంది. ఢిల్లీలో రూ.1,58,770 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,58,620గా ఉంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,46,500గా, ఢిల్లీలో రూ.1,45,550గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో రూ.1,45,400గా ఉంది. చెన్నైలో కిలో వెండి రూ.2.8 లక్షలకు చేరుకోగా ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది.

## కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరుతో గ్యారంటీ లేని పాలన..!

*ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రజలకు ఇచ్చే హామీలు కేవలం మాటల సమాహారం కావు, అవి ప్రజల ఆశలు, అవసరాలు, భవిష్యత్తుపై ఉన్న నమ్మకానికి ప్రతీకలు. ప్రతి మేనిఫెస్టో ఒక సామాజిక ఒప్పందంలా పని చేస్తుంది. ఓటరు తన ఓటుతో ఒక పార్టీకి అధికారాన్ని అప్పగించినప్పుడు, ఆ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు అమలు అవుతాయని విశ్వసిస్తాడు. ఆ విశ్వాసమే ప్రజాస్వామ్యానికి మూలస్థంభం. కానీ ఆ విశ్వాసం దెబ్బతింటే అది ఒక ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తే అంశంగా మారుతుంది.*



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ఇటీవలి రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలు మరియు వందలాది హామీలు ఇప్పుడు అమలు విషయంలో సందేహాలకు గురవుతున్నాయనే భావన బలపడుతోంది. అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీలు ప్రజల్లో విపరీతమైన ఆశలు రేపాయి. రైతుకు భరోసా, మహిళకు గౌరవం, యువతకు ఉపాధి, విద్యార్థికి భవిష్యత్తు, పేదలకు సంక్షేమం అనే పేర్లతో ప్రచారం చేసిన వాగ్దానాలు ఒక కొత్త పాలనకు సంకేతంగా చూపించబడ్డాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో కనిపిస్తున్న ఆలస్యం, స్పష్టత లేమి ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది.

ఒక ప్రక్కన రైతు సమస్యలను తీసుకుంటే, పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. వ్యవసాయం ఇప్పటికే ప్రకృతి ఆధారితమైన రంగం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అందించాల్సిన మౌలిక సదుపాయాలు సమయానికి అందకపోతే రైతు స్థితి మరింత క్లిష్టమవుతుంది. ఎరువుల కొరత, ముఖ్యంగా యూరియా లభ్యతలో సమస్యలు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విత్తనాలు వేయాల్సిన సమయంలో ఎరువులు అందకపోతే పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. రైతు అప్పుల బారిన పడే ప్రమాదం పెరుగుతుంది. ప్రభుత్వం ఈ సమస్యలను తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో అలాంటి చురుకుదనం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక డిజిటల్ పరిష్కారాల పేరుతో తీసుకువస్తున్న నిర్ణయాలు కూడా విమర్శలకు గురవుతున్నాయి. యాప్‌ల ద్వారా ఎరువుల పంపిణీ వంటి ఆలోచనలు వినిపిస్తున్నాయి. కానీ నేలపై సరఫరా లేకపోతే టెక్నాలజీ ద్వారా సమస్య పరిష్కారం సాధ్యం కాదు. టెక్నాలజీ ఒక సహాయక సాధనం మాత్రమే, అది వాస్తవ సమస్యను భర్తీ చేయలేను. ఈ విధమైన చర్యలు సమస్యను పరిష్కరించే ప్రయత్నంగా కాకుండా, దానిని దాచిపెట్టే ప్రయత్నంగా భావించబడుతున్నాయి.

విద్యార్థుల పరిస్థితి కూడా తక్కువగా లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల వేలాది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ పథకాలపై ఆధారపడతారు. ప్రభుత్వం చెల్లింపులు ఆలస్యం చేస్తే వారి చదువు మధ్యలోనే ఆగిపోవచ్చు. విదేశీ విద్య పథకాల కింద చదువుతున్న విద్యార్థులు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారని సమాచారం. ఒకవైపు పెద్ద ఎత్తున పథకాలు ప్రకటించడం, మరోవైపు వాటి అమలులో ఆలస్యం చేయడం పాలనలో ఉన్న విరుద్ధతను బయటపెడుతోంది.

ఉద్యోగాల అంశంలో యువతలో అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో భారీగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ వంటి హామీలు ఇచ్చారు. ఇవి యువతలో ఆశలు పెంచాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో స్పష్టత కనిపించడం లేదు. కొత్తగా ఉద్యోగాలు కల్పించడం కంటే, గతంలో ఇచ్చిన




నోటిఫికేషన్లను తమ ఖాతాలో వేసుకోవడం వంటి చర్యలు విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. నిరుద్యోగులు ఎదురుచూస్తున్న సమాధానాలు ఇంకా అందకపోవడం వారి నిరాశను మరింత పెంచుతోంది.

ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. పీఆర్సీ, డీఏలు, ఇతర బకాయిల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని ముందుకు నడిపే కీలక శక్తి ఉద్యోగులే. వారి సమస్యలను నిర్లక్ష్యం చేయడం పాలనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. సంక్షేమ పథకాల ప్రచారం ఒకవైపు కొనసాగుతుండగా, ఉద్యోగుల హక్కులు మరోవైపు నిర్లక్ష్యం చేయబడుతున్నాయనే భావన ఏర్పడుతోంది.

సామాజిక న్యాయం అంశంలో కూడా అమలు లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు, ప్రత్యేక పథకాలు, ఆర్థిక సాధికారత వంటి అంశాలు మేనిఫెస్టోలో ఉన్నప్పటికీ, వాస్తవ అమలు విషయంలో పురోగతి మందగించింది. సామాజిక న్యాయం కేవలం నినాదంగా మిగిలిపోతే అది సమాజంలో అసమానతలను మరింత పెంచుతుంది.

మహిళల సంక్షేమం కూడా ఇదే తరహాలో ఉంది. ఆర్థిక భద్రత, గౌరవం, సంక్షేమం పేరుతో ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు కాలేదనే భావన మహిళల్లో పెరుగుతోంది. ఎన్నికల సమయంలో మహిళా ఓటర్లను ఆకర్షించడానికి ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత కోల్పోవడం ఒక రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. మహిళల అభివృద్ధి ఒక సమాజ అభివృద్ధికి కీలక అంశం. ఆ దిశగా తీసుకునే చర్యలు స్పష్టంగా కనిపించాలి.

అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కూడా పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి. ప్రాజెక్టుల అమలు సమయంలో భూముల స్వాధీనం, పునరావాసం వంటి అంశాల్లో స్పష్టత లేకపోవడం ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు కాదు; అది ప్రజల జీవితాలను మెరుగుపరచే ప్రక్రియ. ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా అభివృద్ధి జరగకూడదు.

పరిశ్రమల కోసం భూముల కేటాయింపుల విషయంలో కూడా విమర్శలు ఉన్నాయి. పెద్ద సంస్థలకు భూములు ఇవ్వడం జరుగుతున్నప్పటికీ, ఆ ప్రక్రియలో పారదర్శకత ఎంత ఉందన్నది ప్రశ్నగా మారింది. ప్రజల వనరులను ప్రైవేట్ ప్రయోజనాలకు ఉపయోగించడం అభివృద్ధి కాదనే అభిప్రాయం బలపడుతోంది.

ఇక పాలనలో కనిపిస్తున్న మరో కీలక అంశం,ప్రశ్నించే స్వరాలపై చర్యలు. జర్నలిస్టులు, ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తే వారిపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. వాటిని అణచివేయడం కాకుండా, వాటి ద్వారా పాలనను మెరుగుపరచుకోవాలి. ప్రశ్నలను అణచివేయడం విశ్వాసాన్ని తగ్గిస్తుంది.

ఈ మొత్తం పరిస్థితిని పరిశీలిస్తే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మరియు అధికారంలో అమలు మధ్య ఉన్న వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. మాటలు ఆకర్షణీయంగా ఉండటం సరిపోదు, ఆచరణలో ఫలితాలు కనిపించాలి. ప్రజలు ఇప్పుడు అదే కోరుతున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఆత్మపరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని పునఃసమీక్షించాలి. వాటి అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ప్రజలతో పారదర్శకంగా మాట్లాడాలి. సమస్యలను అంగీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలి. అదే ప్రజాస్వామ్యానికి గౌరవం ఇచ్చినట్లవుతుంది.

లేకపోతే ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి భవిష్యత్తులో రాజకీయ తీర్పుగా మారే అవకాశం ఉంది. ఎన్నికలు కేవలం ఓటింగ్ ప్రక్రియ కాదు, అది ప్రజల అభిప్రాయానికి ప్రతిబింబం. ఆ అభిప్రాయం మారితే రాజకీయ సమీకరణలు కూడా మారిపోతాయి. ప్రజలు మౌనంగా ఉన్నప్పటికీ వారు గమనిస్తున్నారు. సరైన సమయం వచ్చినప్పుడు తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తారు.

ప్రజల నమ్మకం ఒకసారి కోల్పోతే తిరిగి పొందడం చాలా కష్టం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ప్రభుత్వానికి అత్యంత కీలక బాధ్యత. హామీలు కేవలం ప్రచార సాధనాలుగా కాకుండా, పాలనకు మార్గదర్శకాలుగా మారాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.ఇప్పటికైనా మార్పు అవసరం. మాటల్లో కాదు, కార్యాచరణలో కనిపించే మార్పు అవసరం. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలి అని కోరుకుందాం.

https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

## పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలి భారతీయ జనతా పార్టీ నాయకులు






**తూర్కయంజాల్ వెలుతురు మార్చి 17:** తొర్రరు రోడ్ లో రాజీవ్ గృహ కల్ప ఎదురుగ ఉన్న పురాతన పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వసం చేసిన విషయం తెలుసుకొని సంఘటన స్థలాన్ని సందర్శించి అట్టి విషయాన్ని వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది సీఐ రవి గారు ఏసీపీ పోలీస్ లు కూడా అక్కడికి వచ్చి ఫోషులను ఎలాగైనా పట్టుకుంటామని వారు త్రలియా జేశారు ఏది ఏమైనా దోషులను పట్టుకొని శిక్షించాలని బిజెపి నాయకులు హిందూ సంఘల నాయకులు డిమాండ్ చేసారు.

## దాద్ పల్లి గ్రామ అభివృద్ధి కోసం 25లక్షలు మంజూరు చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నేనావత్ రాజు నాయక్**



**మంచాల వెలుతురు మార్చి 17:** మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నేనావత్ రాజునాయక్ మాట్లాడుతూగ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికోసం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిగారి సహకారంతో 25లక్షల రూపాయలు మంజూరుఅయ్యాయి అన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుండి గ్రామాలు అన్నివిధాలుగా అభివృద్ధిలోదూ సుకెళ్తున్నాయి అనిఅన్నారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహ కారంతో మంచాల మండలంలో ప్రతిగ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు వేస్తూ పను లు ప్రారంభిస్తున్నారు అని అన్నారు అభివృద్ధిఅంటే ఏమిటో చేసి చూపిస్తున్నగొప్పఎమ్మెల్యే అభి వృద్ధిప్రదాత మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారుఎమ్మెల్యేగారి సహకారంతోదాద్ పల్లిగ్రామని అన్నిర కాల మౌలికవసతుల సదుపాయాలతో గ్రామాన్నిపూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాంఅని అన్నారు వెంకటేశ్వరతండాలోత్రాగునీటి సమస్యఉంది అని అడగగానే వెంటనేస్పందించి బోరు వేయించి నందుకు గ్రామఅభివృద్ధికి 25లక్షలరూపాయలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేమల్ రంగారె డ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలుతెలిపారు


## ఎంపీ నిధులతో బోర్ వెల్ నిర్మాణం ప్రారంభం



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 17:** మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ నిధులతో బోర్ వెల్ నిర్మాణం మంగళవారం ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ డబల్ బెడ్ రూమ్ కాలనీలో ఎంపీ ఈటెల రాజేందర్ పండ్ ద్వారా 9 బోర్లు సాంక్షన్ అవ్వడం జరిగిందని స్థానిక బిజెపి నాయకులు తెలిపారు. నేటి ఎదడిది నివారించేందుకు బోర్ వేస్తున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ బిజెపి పార్టీ జనరల్ సెక్రెటరీ విగ్నేష్, దుండిగల్ సర్కిల్ బిజెపి ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ఆర్కే రాజకుమార్, బిజెపి సీనియర్ నాయకులు, డబల్ బెడ్ రూమ్ ఏడు విభాగాల ప్రెసిడెంట్లు మరియు డబల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తెలుగుతల్లి నగర్ లో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 17:**



సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, తెలుగుతల్లి నగర్ లో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మరియు కళ్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిహెచ్ఎంసి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ హాజరై రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం కమిటీ సభ్యులు నిర్వహించిన ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి ఉత్సాహంగా వేడుకలను ఆస్వాదించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఉండాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పసుల కృష్ణ, శేఖర్, స్వరూప రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పసుల లక్ష్మి, బాలకృష్ణ, రామకృష్ణ, లక్ష్మణ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలకు కమిటీలను ఏర్పాటు చేయాలి

**- ఉక్కుల అశోక్**



**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 17:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వచ్చే ఏప్రిల్ నెలలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలకు ఉత్సవ కమిటీలను వెంటనే నియమించాలని దళిత చైతన్య వేదిక (డి సివి ) రాష్ట్రఅధ్యక్షులు ఉక్కుల అశోక్ గౌరవనీయులైన రంగారెడ్డి జిల్లాకలెక్టర్ నారాయణరెడ్డి గారిని కోరారు డీసీవీ ఆఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ లో బాబూ జాగ్జీవన్ రామ్ మహాత్మాజ్యోతిరావు పూలె డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ జయంతి కార్యక్ర మాలు ఉన్నాయని తెలిపారుఈఉత్సవాల నిర్వహణకు కమిటీలను వేయడంలొ నిర్లక్ష్యంగా వ్య వవారిచడం సరికాదు మిగితాజిల్లాలాలో సామాజిక, ప్రజాసంఘాలు దళిత సంఘాల నాయకు లను సంప్రదించి కమిటీలను వేయడం జరిగింది కావున రంగారెడ్డి జిల్లాకలెక్టర్ నారాయణ రెడ్డి గారువెంటనే ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేసి ఆకమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరిగేలా గౌరవనీయులైన రంగారెడ్డి జిల్లాకలెక్టర్ నారాయణరెడ్డి గారుచర్యలు తీసుకోవాలని కోరారు

# ఎమ్మెల్యే మందుల సామెల్ పై దాడి అనగరికం

**- :సిపిఐ,దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన.**



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 17:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ పై ఆర్ఎస్ ఎస్, బీజేపీ గుండాలపై దాడిని నిరసిస్తూ మంగళవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు మందుల శామ్యూల్ పైన ఆర్ఎస్ఎస్ మరియు బిజెపి నాయకులు పరుష పదజాలంతో తిట్టుకుంటూ ఇంటిపైన దాడి చేయడం అనాగరికమైన చర్య అని అన్నారు. జైశ్రీరామ్ అంటూ లంజాకొడకా అని తిట్టడం జై హిందూ మతం అంటూ ఎవరికి పుట్టినావు రా అని తిట్టడం అనేది వారి అహంకారానికి నిదర్శనం అన్నారు. ఇది రాష్ట్రంలో బిజెపి చేస్తున్న కుల రాజకీయాలని బ్రాహ్మణులను తిడితే మొత్తం హిందూ మతాన్ని తిట్టినట్టు ప్రచారం చేసుకోవడం ఈ రాష్ట్రంలో అశాంతిని నెలకొల్పడమేనని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు జరగడం వెనకాల మనువాద గుండాల హస్తముందని దీనికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లాంటి వాళ్ళ మాటలు కూడా తోడ్పాటు ఇస్తున్నాయని మంచిగా ఉన్న రాష్ట్రాన్ని విద్వేషాలకు పెంచుతున్న బిజెపి ఆర్ఎస్ఎస్ ఈ సంఘటనతో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. హిందూ మతం పేరుతో దాడులు చేయడం మతాన్ని రాజకీయంగా వాడుకోవడం, హిందూ మతం అంటే కేవలం బిజెపి అన్నట్టు ప్రచారం చేసుకోవడం హిందూ మతాన్ని కించపరచడమే అని దుయ్యబట్టారు. బండి సంజయ్ ఈ కుట్ర దాడి వెనకాల ఉన్న వారందరూ రాష్ట్రంలోని దళిత బహుజనులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బెయిల్ రాకుండా చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో ఉన్న దళిత బహుజనులతో పాటు సిపిఐ బిజెపికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో ముందుంటుందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీనియర్ నాయకులు లింగయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న మాదిగ, జర్నలిస్టు నాయకులు రామస్వామి, తొండ వెంకట్, గణేష్, నరేష్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు బాబు, వల్లూరి బాబు, వెంకటేష్, సోమయ్య, హిందూ బిసి మహాసభ నాయకులు నరహరి, జై భీమ్ నాయకులు అల్వాల భాస్కర్, పరుశరాములు అశోక్, అరుణ్, సిపిఐ నాయకులు ఇమామ్, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి బీసీలంటే చిన్న చూపు ఆయన తీరు మార్చుకోవాలి

**- అగ్రకులానికి చెందిన వారు టిపిసిసిగా ఉంటేనే వంద సీట్లు గెలిచి కాంగ్రెస్ పార్టీ పుంజు కుంటుందా బీసీలు టిపిసిసిగా ఉంటే పార్టీ పంచుకోదా ??**

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 17:** రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీసీల పట్ల తనకున్న మనస్తత్వాన్ని తేట తెల్లం చేశారని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ జగ్గారెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు అయితే వంద సీట్లు గెలుస్తామని, కాంగ్రెస్ పార్టీ బలంగా పుంజుకుంటుందని మాట్లాడటం ఆయనకున్న కులపిచ్చి మరియు బీసీలు అంటే చిన్న చూపేనని అన్నారు.ఆయన మాటలు బీసీ పిసీసీ అధ్యక్షుడునీ అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీ వ్యక్తి పీసీసీ అధ్యక్షుడు అయితే ఓర్వలేక పోతున్నారని మంగళవారం రోజున బీసీ బిడ్డ టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలోనే రెండు ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారని సర్పంచి మరియు మున్సిపల్ ఎన్నికల్లో 80 శాతం పైగా గెలిపించి మహేష్ కుమార్ గౌడ్ తన సత్తా చాటారని ఈ విషయం కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి తెలియదా అని ప్రశ్నిస్తున్న. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి బీసీలు అంటే మొదటి నుంచి చిన్న చూపేనని అన్నారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బీసీ అయితే కూడా ఓర్వలేకే అతనిని చాలా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు.వెంటనే కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అతని వ్యాఖ్యలు వెనుక తీసుకోవాలని లేనిపక్షంలో బీసీల ఆగ్రహానికి గురిగాక తప్పదని లింగం గౌడ్ హెచ్చరించారు.

## బంగారు లక్ష్మణ్ సేవలు మరువ లేనివి

**- బిజెపి నాయకులు బోసుపల్లి ప్రతాప్**



**తూర్కయంజాల్ వెలుతురు మార్చి 17:** భారతీయ జనతా పార్టీ దివంగత నేత జాతీయ మాజీ అధ్యక్షులు కేంద్ర మాజీ మంత్రివర్యులు బంగారు లక్ష్మణ్ గారి జయంతిని పురస్కరించుకొని యంజాల్ కూడలిలో ఆయన చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళులర్పించిన భారతీయ జనతా పార్టీ నాయకులు బిజెపి క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ యాదవ్ బిజెపి రాష్ట్ర నాయకులు కొంద్రు పురుషోత్తం బచ్చిగళ్ళ రమేష్ పలుస శ్రవణ్ కుమార్ గౌడ్ ఎలిమినేటి నర్సింహా రెడ్డి నందగిరి సురేష్ అందెకార్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు

# చేతి వృత్తిదారుల మహాధర్నా, దద్దరిల్లిన ఇందిరా పార్క్






**హైదరాబాద్ వెలుతురు మార్చి 17:** మంగళవారం రోజున చేతి వృత్తుదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద కన్వీనర్ యం.వి.రమణ, మరియు వివిధ సంఘాల అధ్యక్షుల అధ్యక్షతన మహాధర్నా జరిగింది. వివిధ చేతి వృత్తులకు సంబంధించిన వారు వృత్తి పరికరాలతో పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ , మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల మంది చేతివృత్తులు చేస్తున్నారు. వీరి వృత్తిలో ఆధునీకరణ తీసుకురావడం, ఉపాధి మెరుగుపరచడం కోసం రాష్ట్రంలో ఏర్పాటుచేసిన కార్పొరేషన్లు ఫెడరేషన్ లు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయని దుయ్యబట్టారు .గత బడ్జెట్లో కేటాయింపులే తక్కువగా చేశారని అవి కూడా ఖర్చు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. ఎన్నికల సందర్భంగా వృత్తిదారులను ఆకట్టుకోవడానికి మాత్రం రాజకీయ పార్టీలకు బాగా ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఏవేవో కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి వృత్తిదారులకు ఇవ్వడానికి చేతులు ఎందుకు రావడం లేదని అన్నారు. వృత్తిదారులందరూ సమస్యలపై ఐక్యం కావాలని ప్రభుత్వం మెడలు వంచి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో అనేక వాగ్దానాలు చేసింది. కానీ ఏ ఒక్కటి నెరవేర్చలేదు అన్నారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్ 3,04,965 కోట్ల లో కల్లుగీత సహకార సంస్థ కు 68 కోట్లు, మిగతా 19 సహకార సంస్థలకు 50 కోట్ల చొప్పున కేవలం 1018 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్ కు 400 కోట్లు మాత్రమే కేటాయించారు. నామ మాత్రపు బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నది. ఆ కేటాయించిన నిధులు కూడా ఖర్చు చేయడం లేదు.వృత్తిదారుల ఉపాధి మెరుగుపరుచుటకు, అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల వృత్తి సంఘాల నేతలం రాష్ట్ర కార్పొరేషన్ లు, ఫెడరేషన్ లు సందర్శించాం. ఒక్క కల్లుగీత కార్పొరేషన్ కు మాత్రమే 17 కోట్లు విడుదలైనట్లు తెలిసింది. మిగతా 51 కోట్లు ఇవ్వాల్సి ఉంది. మిగతా సంస్థలకు ఇప్పటివరకు రూపాయి కూడా రాలేదు. మరొక 15 రోజులలో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. బడ్జెట్ కేటాయింపులే తక్కువ చేశారు. అవి కూడా ఖర్చు చేయకపోవడం చూస్తే వృత్తిదారుల పట్ల ప్రభుత్వ వైఖరి అర్థం చేసుకోవచ్చు అన్నారు. డబ్బులు లేకపోవడంతో ఆఫీసులో సిబ్బంది ప్రభుత్వ ఖజానా వైపు ఎదురుచూస్తున్నారు. ఎంతో కొంత ఏమైనా సహకారం అందుతుందేమో అని ఆఫీసుల చుట్టూ వృత్తిదారులు తిరుగుతున్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్ లో కేటాయింపులు చేసి ఆచరణలో ఖర్చు చేయడం లేదు నిరుపయోగంగా మారుతున్నాయి. ఆ సంవత్సరం ఖర్చు కాకపోతే తదుపరి బడ్జెట్ లో వాటిని కలిపి ఖర్చు చేసే విధంగా బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలి. వృత్తి చేసేవారి ఉపాది భద్రతకు, సామాజిక రక్షణకు, చిత్తశుద్ధితో పనిచేయాలి. సంక్షేమానికి బడ్జెట్ లో తగిన నిదులు కేటాయించాలి.

డిమాండ్స్

1.2026-27 బడ్జెట్ లో 25 వేల కోట్లు కేటాయించాలి, గత బడ్జెట్ లో కేటాయించిన నిధులు మొత్తం ఖర్చు చేయాలి.
2. బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలి.
3. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో వృత్తిదారులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.
4.వృత్తి దారులందరికీ పెన్షన్, ఎక్స్గ్రేషియా ఇవ్వాలి.
5.బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ వర్గీకరించి అమలు చేయాలి

పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి.రమణ వివిధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మత్స్య కార్మిక సంఘం లెల్లెల బాలకృష్ణ, గోరెంకల నర్సింహా రజక వృత్తిదారుల సంఘం పైళ్ల ఆశయ్య ,ఏదునూరి మదార్ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం. ఉడుత రవీందర్,కల్లుగీత కార్మిక సంఘం బెల్లంకొండ వెంకటేశ్వర్లు వి.వెంకట నరసయ్య, చేనేత కార్మిక సంఘం గంజి మురళి ,వనం శాంతి కుమార్ బ్యాండు వాయిద్య కళాకారుల సంఘం. గుమ్మడి రాజు నాగరాజు , శేఖర్,విశ్వకర్మ వృత్తి దారుల సంఘం రాళ్ల బండి కుమారస్వామి , భీష్మ చారి, వడ్డెర వృత్తిదారుల సంఘం. పల్లపు విగ్నేష్ ఇడుపుగంటి సాయిలు ,క్షౌర వృత్తిదారుల సంఘం.చెన్నారం మల్లేశం. ఒగ్గు కథ జానపద కళాకారుల సంఘం అమీర్ పేట మల్లేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ వృత్తిదారుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

# హిందూ సమ్మేళన నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు

**కరీంనగర్ వెలుతురు మార్చి 17:** సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ పట్టణం హౌసింగ్ బోర్డ్ లో హిందూ సమ్మేళనం నిర్వహించడానికి కమిటీని ఏర్పాటు చేశారు.శ్రీ యజ్ఞవరాహస్వామి



హిందూసమ్మేలనసమితి గా ఈ కమిటీ కి ఈ సందర్భంగా నామకరణం చేశారు. పుర ప్రముఖులు చందాసుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కమిటీ కి అధ్యక్షులుగా చొల్లేటి రమేష్ ,కార్యదర్శి గాబూట్ల పవన్ కుమార్ , కోశాధికారిగా గంద్ర సత్యనారాయణమహిళా ప్రముఖులుగా బండపల్లి ఉదయ తదితరులను ఎన్నుకున్నారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విభాగ్ సహవ్యవస్థాప్రముఖ్ దావులూరి మురళీధర్ మాట్లాడుతూ హిందూ సమ్మేళన ఆవశ్యకత , ఎందుకు నిర్వహించుకోవాలనే విషయంపైన అవగాహన కల్పించారు చొల్లేటి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బస్తీ ప్రముఖ్ కూనాడి



రాంరెడ్డి ,మండల కార్యవాహ మాదాసు విక్రమ్ , మండలవ్యవస్థాప్రముఖ్ తాడెంఐలయ్య , శాఖా కార్యవాహ ఎం లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయం

**- చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ**



**మునుగోడు వెలుతురు మార్చి 17:**

మునుగోడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మునుగోడు ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమని చండూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జమస్తాన్ పల్లి గ్రామంలో మునుగోడు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి సహకారంతో జమస్థాన్ పల్లి గ్రామానికి చీ=జు+ూ పథకం కింద 5లక్షల వ్యయంతో మంజూరైన సిసి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, గ్రామ సర్పంచ్ అందుగుల నరసమ్మ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పంతంగి స్వామి, జాజుల స్వామి గౌడ్, అందుగుల లింగయ్య, జాజుల శంకర్, జినుకుంట్ల ముత్యాలు,కొప్పుల అశోక్, అందుగుల నరేందర్, నవీన్, గ్రామపంచాయతీ కార్యదర్శి రాగిణి, ఫీల్డ్ అసిస్టెంట్ పగిళ్ళ సైదులు, ఉపసర్పంచ్ ముంత మంగమ్మ, గ్రామస్తులు పంతంగి నరసింహ, ముంత లింగమ్మ లింగయ్య, జాజుల లక్ష్మయ్య, పంతంగి వెంకన్న, ముంత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పార్వతీ శంకర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 17:**

గ్రామం ఇంద్రపాల నగరం శ్రీ పార్వతి శంకర స్వామి గుట్ట పైన మాస శివరాత్రి సందర్భంగ నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని శ్రీపార్వతి శంకర స్వామి కరుణా కటాక్షాలు చల్లని దీవెనలు ఇంద్రపాలనగర గ్రామ ప్రజలపై పాడిపంటలపై పశుసంపదపై ఉండాలని కోరుకున్న సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధస్వామి, సింగణబోయిన గణేష్ యాదవ్, రాజన్నగారిరమేష్, ఆలయ అధ్యక్షులు సింగణబోయిన పాండరి యాదవ్, జోగు నర్సింహా, మర్రి శంకర్,మారసని శ్రీను,గోగికార్ నర్సొజీ,బొల్ల నర్సింహా,మండల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి





**గుండాల మార్చి 17 (వెలుతురు):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలో ఉన్న ముస్లిం సోదరులు రంజాన్ పండుగ ప్రశాంతంగాకోవాలని ఎస్సై తేజం రెడ్డి అన్నారు.మంగళవారం స్థానిక జుమ్మా మసీదులో ముస్లిం సోదర తో మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లుచేసిందని ఈ సందర్భంగా మా వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షర్ఫుద్దీన్, సిరాజుద్దీన్ , బురాన్, అబ్బాస్, బషీర్, ఉస్మాన్, ఉస్మాన్ ,తదితరులు పాల్గొన్నారు

# 25 వోల్టేజి కొత్త ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించిన సర్పంచి గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 17:**

గ్రామం ఇంద్రపాలనగరం 9,10,11, వార్డ్ లలోని లోవోల్టేజి సమస్య ను అధికారుల దృష్టి కి తీసుకెళ్లగా మంజూరయిన 25 వోల్టేజి ట్రాన్స్ ఫార్మర్ ను ప్రారంభించిన గర్ధాస్ విక్రమ్ సర్పంచ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి వార్డ్ మెంబెర్ లు వరి కుప్పల స్వామి,నల్ల ఎల్లేష్,కుంచం రమేష్, ఎల్లయ్య,సింగణబోయిన జంగయ్య, ఈర్లపల్లి మల్లయ్య ,చిన్నపాక సురేష్, నీరుడు నరేష్, బోనగిరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కమీషనర్ గారు కాస్త లైట్ వేయరూ...

**మోత్కూర్, మార్చి 17,(వెలుతురు న్యూస్ ):**



మోత్కూర్ మున్సిపాలిటీ చెరువు కట్ట ప్రాంతంలో ముత్యాలమ్మ గుడి దగ్గర అదేవిధంగా కాశ వాడ నుండి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు చాలా రోజుల నుండి వీధి లైట్లు లేక చీకటిలో తీవ్ర ఇబ్బందులకు గురైతున్నామని ఈ ప్రాంత ప్రజలు తెలిపారు. సంబంధిత మున్సిపాలిటీ సిబ్బందికి ఎన్ని సార్లు చెప్పినా వేస్తాం, వేస్తాం అని అంటున్నారు తప్ప వేయడం లేదని అన్నారు. మోత్కూర్ లో విభిన్నంగ జరిగే ఉగాది పండుగ ఉండి కూడా ముత్యాలమ్మ గుడి దగ్గర లైట్ లు లేకపోవడం ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది దీన్ని దృష్టిలో పెట్టుకొని కమీషనర్ గారైన లేక పాలక వర్గం అయినా స్పందించి తక్షణమే వీధి లైట్లు వేయాలని కోరుకుంటున్నారు.

# వంద పడకల ఆసుపత్రి హామీ ఇచ్చేదాకా దీక్ష విరమించేది లేదు

**- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జిల్లెల పెంటయ్య.**

**- నిరవధిక నిరాహార దీక్షలకు పెరుగుతున్న ప్రజాదరణ**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 17:**

ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ ఇచ్చేదాకా నిరవధిక దీక్షలు విరమించేది లేదని ప్రాణాలు పోయినా దీక్ష కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిల్లాల పెంటయ్య తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలోని చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరిన సందర్భంలో మండలంలోని వివిధ రంగాల సంస్థలు, ప్రజల నుండి ప్రజాదరణ పెరుగుతుందని అన్నారు. దీక్షలు రెండో రోజుకు చేరిన సందర్భంగా వివేకానంద డివైన్ మోడల్ స్కూల్, డాన్ బాస్కో స్కూల్ యాజమాన్యం విద్యార్థిని విద్యార్థులు, మండల పాత్రికేయులు,మండల మెడికల్ షాప్స్(కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్) మండల అసోసియేషన్ సభ్యులు, మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, లాయర్స్ యూనియన్ అసోసియేషన్ నాయకులు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ,పూల బండ్ల షాప్ల మహిళలు స్వచ్ఛందంగా నిరవధిక నిరాహార దీక్షలో శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఒకవైపు నాయకుల ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి అధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడం ప్రజాపాలనలో ప్రజల కోసం పోరాటానికి మద్దతు తెలపకపోవడం విచారకరమని అన్నారు. వంద పడకల ఆస్పత్రి కొరకు ప్రజాప్రతినిధులు అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని లేని పక్షంలో రామన్నపేట మండల బందుకు పిలుపునిచ్చి వివిధ రంగాల ప్రజలను,మేధావులను,వివిధ రాజకీయ పార్టీలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దీక్ష సభ్యులు సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహ చారి, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, గొరిగె సోములు,వేముల సైదులు,శానగొండ రాము ఉన్నారు. మద్దతు తెలిపిన వారిలో వివేకానంద డివైన్ మోడల్ స్కూల్ కరస్పాండెంట్ తిరగడం మల్లికార్జున్,స్కూల్ యాజమాన్యం పిట్టల మత్స్యగిరి, మండల మెడికల్ షాప్స్ యజమాన్యం రాపోలు రమేష్,నరసింహ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మండల అధ్యక్షులు నోముల చిరంజీవి, లాయర్స్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు మామిడి వెంకటరెడ్డి, పాల్వంచ జగతయ్య,పూల బండ్ల షాప్ మహిళలు శంకరమ్మ, లక్ష్మమ్మ తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని దీక్షలకు మద్దతు తెలిపారు. క్షీణిస్తున్న నాయకుల ఆరోగ్యం నిరవధిక దీక్షలో కూర్చున్న నాయకుల ఆరోగ్యం క్షీణిస్తుందని యాత్ర సభ్యులలో ఒకరికి బి.పి లెవెల్స్ ఎచ్చుతగ్గులవుతున్నాయని,ఇద్దరు వ్యక్తులకు షుగర్ లేవల్స్ తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దదీక్షలలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బల్బురి అంజయ్య మండల నాయకులు గన్నెబోయిన విజయభాస్కర్,గాదె నరేందర్, పులి భిక్షం,ఎండి రషీద్ ,బొడిగె రజిత, నీల ఐలయ్య,మునుకుంట్ల లెనిన్,పావురాల మత్స్యగిరి గంటపాక శివకుమార్ పుట్టల ఉదయ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# పంతంగి టోల్గేట్ వద్ద 60.685 ఎండు గంజాయి పట్టివేత




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 17:**

పంతంగి టోల్గేట్ వద్ద ఆటోలో తరలిస్తున్న తరలిస్తున్న 60.685 కిలో ల ఎండు గంజాయి పట్టివేత మంగళవారం రోజున 17-03-2026 తేదీ న ఉమ్మడి నల్గొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్అధికారి ఎం. విష్ణు మూర్తి ఆదేశాల మేరకు ఆర్. బాళోజి నాయక్ ఎస్ హెచ్ ఓ . రామన్నపేట మరియు కె. రవిచంద్ర రెడ్డి ఎస్ హెచ్ ఓ మోత్కూర్ ఆధ్వర్యంలో పంతంగి టోల్గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక ఆటో ను ఆపి తనిఖీ చేయగా దానిలో 60.685 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఇట్టి గంజాయి ని ఏ1) గంగా బాయ్ పాండు రంగ్ చౌహన్ ఆర్ మహారాష్ట్ర, ఏ2) కమల్ అర్జున్ మోహితే మహారాష్ట్ర, ఏ3) విజయ్ ఆసరం గోరపడే మహారాష్ట్ర, ఏ4) వల్లపు దాసు వేణు కుమార్ నల్గొండ అను వ్యక్తులు ఒడిశా రాష్టం లోని భరంపూర్ నుండి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర కి తరలిస్తూ పట్టుబడినాడు. తదుపరి విచారణ నిమిత్తం ఇట్టి గంజాయిని,1 ఆటో , 2సెల్ ఫోన్ ,ముద్దాయిలను మరియు ముద్దాయి వద్ద గంజాయి ( వీటి మొత్తం విలువ సుమారు రూ.25లక్షలు) రామన్నపేట ఎక్సైజ్ స్టేషన్ కి తరలించడం జరిగింది. ఈ తనిఖీలలో ఎస్ లు ఎన్. శంకర్, బి. శివ కృష్ణ, పి. సత్యనారాయణ కానిస్టేబుల్స్ తిరుమలేష్, రావొజీ, అనిల్, కృష్ణ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, వెంకట్, రహమాన్, రమేష్ రెడ్డి , సోనీ, స్వప్న లు పాల్గొన్నారు.

# పట్టపగలు ప్లాన్ చేసి రూ.8 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు






**జహీరాబాద్ వెలుతురు మార్చి 17:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో పట్టపగలు జరిగిన చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. తూముకుంట గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి భూమి రిజిస్ట్రేషన్ కోసం పట్టణంలోని ఎస్‌బీఐ హైవే బ్రాంచ్‌లో రూ.8 లక్షలు డ్రా చేసుకున్నాడు. బ్యాంకు నుంచి బయటకు వచ్చిన అతడిని గమనించిన ఇద్దరు దొంగలు నిశితంగా అనుసరించారు. తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న నర్సింహారెడ్డి స్కూటీ డిక్కీలో నగదు ఉంచి లోపలికి వెళ్లాడు. ఇదే అవకాశంగా భావించిన దొంగలు నిమిషాల వ్యవధిలో డిక్కీ తెరిచి నగదును ఎత్తుకెళ్లారు. చోరీ సమయంలో ఒకరు కార్యాలయం వద్ద గమనిస్తూ ఉండగా, మరొకరు బైక్‌పై వచ్చి డబ్బులు దోచుకుని పారిపోయారు. ఈ ఘటన మొత్తం కార్యాలయ సీసీటీవీ కెమెరాల్లో నమోదైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. దొంగల కదలికలను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

# రెండో రోజు చౌటుప్పల్ లో కొనసాగిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్



**చౌటుప్పల్ వెలుతురు మార్చి 17:**



భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మున్సిపల్ రూరల్ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026 కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. నిన్న సాయంత్రం లక్కారం మామిడి తోటలో ప్రారంభమైన శిక్షణ తరగతులు మంగళవారం రోజు కొనసాగింపుగా పంచ పరివర్తనలు , బిజెపి చరిత్ర, వికాసం, సైద్ధాంతిక భూమిక, మన కార్య పద్ధతి , మన దృష్టిలో కార్య విస్తరణ, పోలింగ్ బూత్ లో చేయవలసిన కార్యక్రమాలు సోషల్ మీడియా ఏఐ నమో యాప్ సరళయాపుల గురించి సూచనలను వక్తలు వివరించారు.. వికసిత్ భారత్ ముందున్న సవాళ్లు బిజెపి పాత్ర మీడియా సంబంధాలు, శిక్షణ తదితర విషయాల గురించి వక్తలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్లా వీరేందర్ గౌడ్ ,రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ,డాక్టర్ సామిడి ప్రకాష్ రెడ్డి , డాక్టర్ పల్నాటి వెంకట్ రెడ్డి తదితర నాయకులు చౌటుప్పల మున్సిపల్ , రూరల్ జిల్లా రాష్ట్ర నాయకులకు బూత్ అధ్యక్షులకు వివరించారు.ఈ యొక్క కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్, రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్ ,దూడల బిక్షం గౌడ్, శాగా చంద్రశేఖర్ రెడ్డి ,రమణ గోని శంకర్ ముత్యాల భూపాల్ రెడ్డి ,కంచర్ల గోవర్ధన్ రెడ్డి ,తంగెళ్ల వెంకటేశం, చినుకని మల్లేశం, కడారి ఐలయ్య బాలరత్నం ,తడక సురేఖ, పోలపల్లి లక్ష్మీ ,బుడ్డ సురేష్ ,గోష్క నీరజ, బర్మా నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ గ్రంథాలయ చైర్మన్ గా కోమటి మత్స్య గిరి

**మోత్కూర్, మార్చి 17,(వెలుతురు న్యూస్ ):**



మోత్కూర్ శాఖా గ్రంథాలయ చైర్మన్ గా కోమటి మత్స్యగిరిని నియమిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం.డీ అవైస్ ఉర్ రెహమాన్ చిస్తీ జారీ చేసిన ఉత్తర్వులను తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ మంగళవారం హైదరాబాద్ లోని తన నివాసంలో కోమటి మత్స్యగిరికి అందజేశారు.ఈ సందర్భంగా కోమటి మత్స్య గిరికి శు భాకాంక్షలు తెలియజేసి మోత్కూర్ శాఖా గ్రంథాలయ అభివృద్ధికి ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్థానన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం. డీ. అవైస్ ఉర్ రెహమాన్ చిస్తీ తొడ్పాటుతో మోత్కూర్ శాఖా గ్రంథాలయాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు. మోత్కూర్ గ్రంథాలయ అభివృద్ధికి, 12 వేల పుస్తకాల సేకరణ, రూ “ పది లక్షలతో అదనపు రీడింగ్ హాల్ ఏర్పాటు కు కృషి చేసిన మత్స్య గిరిని ఎం. ఎల్. ఎ మందుల సామెల్ అభినందించారు. త్వరలో ప్రమాణస్వీకారోత్సవంలో జిల్లా చైర్మన్ తో పాటు పాల్గొని గ్రంథాలయ అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ సందర్భంగా కోమటి మత్స్య గిరి ఎం. ఎల్. ఎ మందుల సామెలు కు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిస్తీ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# మియాపూర్ వద్ద బస్సు ఫార్మా బోల్తా

**- ఒకరికి తీవ్ర గాయాలు...స్వల్పంగా ట్రాఫిక్ జామ్**

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**

హైదరాబాద్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పార్మా కంపెనీకి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా.. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. లీ ఫార్మా కంపెనీకి చెందిన మినీ బస్సు మంగళవారం ఉదయం 80 గంటలకు 10 మంది ఉద్యోగులతో కేపీహెచ్‌బీ నుంచి గడ్డిపోతారం బయల్దేరింది. 8.30 గంటల సమయంలో మియాపూర్ చౌరస్తా నుంచి బాచుపల్లి వెళ్లే మార్గంలో బీకే ఎన్‌క్లేవ్ సమీపంలో యూటర్న్ వద్ద రెండు బస్సులు సమాంతరంగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో ఓ బస్సును ఆకస్మికంగా కుడి వైపునకు తిప్పారు. దీంతో లీ ఫార్మాకు చెందిన బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సు ముందు సీటులో కూర్చున్న వ్యక్తి తలకు గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. రహదారిపై బస్సు బోల్తా పడటంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్రేన్ సాయంతో బస్సును పైకి లేపి, పక్కకు తీసుకెళ్లారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# 20 న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్-మేళా

**- 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ**

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**



ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 20 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, మరియు ఏదైనీ డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.16,383 నుండి రూ.19,769 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు. 8247656356 ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో నేరుగా హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

వెలుతురు


FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)

## పెళ్లి కట్నాలు దొంగిలించిన పాస్టర్ పై కేసు నమోదు

**కరీంనగర్ వెలుతురు మార్చి 17:**
పెళ్లి కట్నాలు దొంగిలించారనే అభియోగంపై సునీల్ బెన్నీ పాస్టర్ పై కొత్తపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది.కరీంనగర్ పట్టణం రేకుర్తికి చెందిన దుర్గాప్రసాద్ ఈ మేరకు సునీల్ బెన్నీ పై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాస్టర్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే కరీంనగర్ పట్టణం రేకుర్తికి చెందిన దుర్గాప్రసాద్ ఓ ఫంక్షన్ హాల్లో పెళ్లి కట్నాలు రాస్తుండగా , సునీల్ బెన్నీ పాస్టర్ మాటలల్లో పెట్టి కట్నాల సంచిని దొంగిలించారని ఫిర్యాదులు తెలిపారు. మొత్తం రూ.32 వేలు కట్నాల సంచిలో ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## చంద్రబాబు మోచేతి నీళ్లు తాగే వాళ్లకు ఏం తెలుసు కాళేశ్వరం నీళ్ల విలువ

**- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొనతం యాకూబ్ రెడ్డి**

**మోత్కూర్, మార్చి 17,(వెలుతురు న్యూస్ ):**



కూలిపోయింది అన్న కాళేశ్వరజలాలకు పూలు కుంకుమ జల్లుతున్న ఎమ్మెల్యేలను,రాష్ట్ర ప్రభుత్వం చేయబోయే మూసి నది ప్రక్షాళన కు కూడా కాళేశ్వరం జలలానే వడాలనుకుంటున్న సి.యం. ను చూస్తుంటే చచ్చిపోయిన బర్రె పాలిచ్చినట్లే ఉందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొనతం యాకూబ్ రెడ్డి ఏద్దేవ చేశారు.కాళేశ్వరం పిల్లర్ రిపేర్ చేయకుండా ఆంధ్రప్రదేశ్ గోదావరి డెల్టా కు మూడో పంటకు నీళ్లు ఇచ్చుకుంటూ చంద్రబాబు ఋణం తీర్చుకుంటున్నారని తెలిపారు.నిన్న మల్లన్న సాగర్ లో పూలు నీళ్లు జల్లి బిక్కేరు వాగులకు నీళ్లు విడుదలచేసిన ఆలేరు,తుంగతుర్తి ఎమ్మెల్యేలు మల్లన్నసాగర్ లోకి నీళ్లు ఎలా వచ్చాయో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పి నీటి విడుదల చేస్తే బాగుండేది అన్నారు. మీ మోసపు మాటలు అబద్ధాల హామీలు ఎలా అమలువుతున్నాయో ప్రజలకు అర్థమైంది అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో దోసెడి ఇసుక తీయనీయను అని బీరాలు పలికిన ఎమ్మెల్యేగారు ఈరోజు తుంగతుర్తి నుండి వేల లారీల ఇసుక తరలిపోతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారో ఆ దేవునికే ఎరుక . గతంలో నువ్వు మాజీ శాసనసభ్యులపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉంటే నువ్వు కూడా ఇసుక దొంగవేనా. కోట్లాది రూపాయలు నువ్వు దోచుకుంటున్నది వాస్తవమేనా. నీ హయాంలో ఇసుక కొడుతుంటే సంసారం.. అంతకుముందు ప్రభుత్వం కొడితే వ్యభిచారం.. ఎలా అయినదో తుంగతుర్తి ప్రజలకు కచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తప్పు చేసిన ప్రతిసారి దళితబిడ్డను అని చెప్పుకుంటవు. నిజంగా నువ్వు దళితపక్షపాతివే అయితే కెసిఆర్ ప్రవేశపెట్టిన దళితబందు పథకాన్ని ఇందిరమ్మ బందు అనో రాజీవ్ బందు అనో పేరు మార్చి అయినా సరే మీరిస్తానన్న 12,00,000/- ఇవ్వడానికి ప్రయత్నంచెయ్ అని అన్నారు.

## యాసంగి సీజన్‌కు రైతు భరోసా... దరఖాస్తులకు గడువు సమీపం

**- అర్హులైన రైతులు తప్పక దరఖాస్తు చేయండి...**

**- వ్యవసాయ శాఖ సూచన...**




**జహీరాబాద్ వెలుతురు మార్చి 17:**
తెలంగాణ ప్రభుత్వం రైతుల పంట పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి కొత్త దరఖాస్తులు, బ్యాంక్ వివరాల సవరణకు అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి వెల్లడించారు. కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గత వానాకాలం సీజన్‌లో జహీరాబాద్ డివిజన్ పరిధిలో 80,919 మంది రైతులకు రూ.114 కోట్లు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 4,683 మంది రైతులు వివిధ మండలాల్లో ఉన్నారని పేర్కొన్నారు. అదే విధంగా, గత సీజన్‌లో బ్యాంక్ ఖాతా లోపాల కారణంగా 637 మంది రైతులకు సాయం అందలేదని, వారు వెంటనే తమ ఖాతా వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28, 2026 వరకు కొత్తగా పట్టాలు పొందిన రైతులు, ఇంకా రైతు భరోసా పొందని వారు, బ్యాంక్ వివరాలు నమోదు చేయని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి రైతు భరోసా అప్లికేషన్ ఫారం, పట్టాదార్ పాస్ పుస్తకం కాపీ, ఆధార్ కార్డు జీరాక్స్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఫోన్ నంబర్ అవసరమని వివరించారు. ఈ నెల 25వ తేదీ వరకు రైతువేదికలోని స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్ద దరఖాస్తులు స్వీకరించబడతాయని, అర్హులైన ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారుల విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్ ఎదుట ఆశాల ధర్నా

**- అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు**



**నాగర్‌కర్నూల్,మార్చి17( వెలుతురు):**
తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు ఆశ కార్యకర్తలు ధర్నాకు దిగారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అయితే ధర్నా చేస్తున్న ఆశలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని బలవంతంగా పోలీస్ వ్యాన్‌లో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్త వాతారణం నెలకొంది. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ తమకు అనేక హామీలను ఇచ్చిందని.. కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తమ సమస్యల పరిష్కారానికై కలెక్టర్ కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నాకు పూనుకున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఈ ధర్నా చేపట్టగా.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మంగళవారం సైతం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# జనాభా గణన ఆధారంగా ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల ప్రణాళికలు రూపొందించబడతాయి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 17**




జనాభా గణన ఆధారంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల ప్రణాళికలు రూపొందించబడతాయని అదనపు కలెక్టర్ మధుమోహన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చార్జ్ అధికారులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, 2027 జనాభా గణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన ప్రక్రియ మే 11, 2026న ప్రారంభమవుతుందని, రెండవ దశలో జనాభా గణన ఫిబ్రవరి 2027లో జరుగుతుందని, మార్చి 1, 2027ను ప్రామాణిక తేదీగా పరిగణిస్తారని వివరించారు. ఈసారి గణనను ఆధునిక సాంకేతికతతో డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.



మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌ల వినియోగం తో గణనను చేపట్టడం జరుగుతుందని , ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యూమరేషన్ సౌకర్యాన్ని ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. గృహ గణనలో ఇంటి నిర్మాణం, సౌకర్యాలు, కుటుంబ వివరాలు, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలతో పాటు గృహాల్లో ఉన్న వసతుల పై మొత్తం 33 ప్రశ్నల ద్వారా వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి సమాచారం నమోదు చేస్తారని, అధికారులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి గణనలో తప్పకుండా చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి, పైస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సెన్సస్ డైరెక్టరేట్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సి ఎం ఎం ఎస్ పోర్టల్ వినియోగం, హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ స్వీయ గణన విధానాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ లో సీఈఓ చందర్, సి పి ఓ రఘునందన్, డి పి ఓ మురళీ, సంబంధిత అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం

**- జాతీయ పథకంలో భాగంగా రైతులకు ఫార్మర్ కిట్స్ పంపిణీ...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 17:**
రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరొక కీలక అడుగు వేసింది. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం సచివాలయం నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి-డి గ్రామంలో ఎంపికైన 125 మంది రైతులకు ఫార్మర్ కిట్లను గ్రామ సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్య కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందజేసిన ఈ





ఫార్మర్ కిట్లలో క్లాత్ బ్యాగ్, క్షేత్ర దర్శిని డైరీ, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్, చిన్న ప్యాకెట్ డైరీ వంటి ఉపయోగకరమైన వస్తువులు ఉన్నాయి. ఇవి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు, వారి రోజువారీ వ్యవసాయ కార్యకలాపాల్లో సహాయపడతాయి. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం కింద రైతులను ఎంపిక చేసి వారికి సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు కృషి సఖిలను నియమించి, వారి ద్వారా 125 మంది రైతులకు నిరంతరం సేంద్రియ సాగు పద్ధతులపై మార్గదర్శనం ఇవ్వనున్నారు. ఈ విధానం ద్వారా రైతుల్లో సేంద్రియ వ్యవసాయంపై నైపుణ్యం పెంపొందించడమే కాకుండా, పర్యావరణహిత వ్యవసాయ విధానాలు విస్తృతంగా అమలులోకి రావడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సర్టిఫికేషన్ కూడా అందజేసి, వారి ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతులకు అవసరమైన జీవ ద్రావణాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి, అవి సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రదీప్ కుమార్, వీరేందర్, శివప్రియ, రాజు తదితరులు పాల్గొనగా, రైతులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించి, రైతుల ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## ఉద్యోగుల సంక్షేమం, పీఆర్సీ అమలు ఏదీ

**- పెండింగ్ డీఏల విషయంలో జాప్యమెందుకు**

**- ఉద్యోగుల గడ్డు పరిస్థితులను పట్టించుకోని సర్కార్**

**- అసెంబ్లీలో విమర్శలు గుప్పించిన కెటిఆర్**



**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, పీఆర్సీ అమలు , పెండింగ్ డీఏల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆయన ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పీఆర్సీ వేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేటికీ ఆ దిశగా అడుగులు వేయకపోవడం ఉద్యోగ వర్గాలను వంచించడమేనని ఆయన విమర్శించారు. పీఆర్సీ గడువు ముగిసి 27 నెలలు కావస్తున్నా ఇంకా పత్తా లేదని, అలాగే 5 డీఏలు బాకీ ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. కేవలం సర్వీసులో ఉన్న ఉద్యోగులే కాకుండా, రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి రాష్ట్రంలో అత్యంత దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ చేసిన తర్వాత రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందక, ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు సుమారు 80 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి పలు ఉదాహరణలను ప్రస్తావిస్తూ.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి కూడా డబ్బులు లేక, తమకు రావాల్సిన సొంత సొమ్ము కోసం ఎదురుచూస్తూ ప్రాణాలు వదిలిన ఘటనలు కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. 60 లక్షల రూపాయల వరకు బెనిఫిట్స్ రావాల్సిన ఇన్స్పెక్టర్లు, హెడ్ మాస్టర్లు అప్పుల ఒత్తిడితో గుండెపోటుకు గురై మరణించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆయన విమర్శించారు. మరోవైపు నిరుద్యోగుల విషయంలోనూ ప్రభుత్వం మాట తప్పిందని కేటీఆర్ మండిపడ్డారు. గత ఏడాది జూన్ 2న ప్రారంభిస్తామన్న 'రాజీవ్ యువ వికాసం' పథకం ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని ఎద్దేవా చేశారు. తన పార్టీ అధిష్టానానికి వెయ్యి కోట్లు ఇచ్చే సత్తా ఉందని చెప్పుకునే ముఖ్యమంత్రి, రాష్ట్రం కోసం కష్టపడి పనిచేసిన ఉద్యోగులకు , భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ఆయన నిలదీశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీ పక్రియను వేగవంతం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కూకట్‌పల్లి దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్

**- నిందితుల నుంచి రూ.77 లక్షల రికవరీ**



**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
కూకట్‌పల్లి ప్రాంతంలో జరిగిన భారీ దోపిడీ కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.77 లక్షల రికవరీ చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. కూకట్?పల్లిలో ఖుస్రు, అజిముద్దీన్ అనే వ్యక్తులు కోటి రూపాయల నగదును తీసుకుని వెళ్తుండగా వారిపై గుర్తు తెలియని నలుగురు దుండగులు దాడి చేశారు. కళ్లలో కారం చల్లి, వారి వద్ద ఉన్న కోటి రూపాయల నగదును తీసుకుని పరారయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా రూ.1 కోటితో పరారైన నలుగురు దుండగుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు.

## ప్రేమించి పెళ్లి చేసుకుని.. ప్రాణం తీసిన భర్త

**- నాలుగు నెలల గర్భిణిని హతమార్చి పరార్**

**జగిత్యాల,మార్చి17( వెలుతురు):**
జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి చంపాడు. కోరుట్ల మండలం మాదాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి అతను మాదాపూర్‌లోనే నివాసముంటున్నారు. హరిబాబు ప్రభుత్వ ఆస్పత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి రక్తపుమడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బైక్‌ను ఢీకొన్న బస్సు... విద్యార్థి మృతి

**గద్వాల,మార్చి17( వెలుతురు):**
జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఒక విద్యార్థి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాము (17)గా గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. బాధితులను హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

- కమిషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్ చెల్లింపు
- కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం రేవంత్ సన్నాహాలు
- మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపణలు



**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు.ఈ టెండర్లకు సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుంచి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని కూడా ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజల డబ్బును కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# కొత్తగూడెంలో భారీగా గంజాయి పట్టివేత

**భద్రాద్రి,మార్చి17( వెలుతురు):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది.ఒడిశా నుంచి జహీరాబాద్‌కు కారులో గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. భద్రాచలం ఇసుక ర్యాంప్ సమీపంలో ఆ యువకుడిని పట్టుకున్నారు. సుమారు 41 లక్షల రూపాయల విలువ గల దాదాపు 52 కేజీల ఎండు గంజాయిని ఆ యువకుడు తరలిస్తున్నాడు. ఆ యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు గంజాయిని, కారును సీజ్ చేశారు.


# రాజకీయాల్లో నిఖార్సయిన నేత ఓంకార్

- ఓంకార్ శతజయంతి ఉత్సవాల్లో మంత్రి సీతక్క

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్ట్ దిగ్గజ నేత మద్దికాయల ఓంకార్ ఉన్నత విలువలు కలిగిన నాయకుడని, ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర విశేషమని మంత్రి సీతక్క గుర్తుచేశారు. అండర్ గ్రౌండ్ నుంచి ఓవర్ గ్రౌండ్ వరకు ఆయన సాగించిన పోరాటం అపార అనుభవాన్ని అందించిందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కూడా ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నానని తెలిపారు. రవీంద్ర భారతిలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఉద్యమాలు, క్రమశిక్షణ, ప్రజాసేవ వంటి విలువలను ఓంకార్ నుంచి నేర్చుకున్నానని సీతక్క వెల్లడించారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేశారని, ఆయనలేని లోటు నర్సంపేటకే కాకుండా యావత్ తెలంగాణకే తీరని లోటుగా మిగిలిందని అన్నారు. 6 దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చట్టసభల్లో గళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడిగా ఓంకార్ నిలిచారని చెప్పారు. అలాంటి గొప్ప నాయకుడి చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. సురవరం ప్రతాప్ రెడ్డి, గద్దర్, అందెశ్రీ వంటి ప్రముఖుల చరిత్రను ప్రజలకు తెలియ చేస్తున్నామని, అదే విధంగా ఓంకార్ సేవలను కూడా రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. అలాగే ట్యాంక్‌బండ్‌పై ఓంకార్ విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కోరుతున్నారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. ఒక దేశాధినేతను హతమార్చే హక్కు అమెరికాకు ఎవరిచ్చారని ప్రశ్నించారామె. ఇరాన్ మీద దాడిని కూడా ఖండించలేని పరిస్థితుల్లో మన దేశ ప్రభుత్వం ఉందని విమర్శలు గుప్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం మౌనం వహించడం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వం అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు.

# వరి వేస్తే ఉరి అనలేదా

- ఇప్పుడేమో రైతులు గుర్తుకు వచ్చారా
- అసెంబ్లీలో విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు



**హైదరాబాద్, మార్చి17( వెలుతురు):**
బీఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పుడు వారే రైతుల పాట పాడుతున్నారని అన్నారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్, యంత్ర పరికరాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. ఈనెల 22 నుంచి రైతుభరోసా నిధులు పంపిణీ చేయనున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో 60లక్షల మందికి పైగా రైతులకు ఈ నిధులు జమ చేస్తామన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చలో ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజల మద్దతుతో మున్సిపల్, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం దక్కింది. బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు ఆడి తప్పుదోవ పట్టిస్తే ప్రజలు విశ్వసించరు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా 71.86లక్షల టన్నుల ధాన్యం పండించాం. ఎల్లంపల్లి నీటితో పెద్ద ఎత్తున వరి పండింది. బీఆర్ఎస్ హయాంలో మోటార్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. ఇందిరమ్మ రాజ్యం నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ సేవలందిస్తున్నాయని ఆది శ్రీనివాస్ అన్నారు.

# యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి



**హైదరాబాద్, మార్చి17( వెలుతురు):**
తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమెర్జింగ్ ఏరియాస్' అనే అంశంపై మంగళవారం టి-సాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు తమ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కళలను నిజం చేసేందుకు తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్ లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించా మన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తేబోతున్నామని, ఏఈడీపీ( అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రొగ్రామ్స్)లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికి మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్ అండ్ ప్రయివేటు భాగస్వామ్యంతో తెలంగాణాలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని బాలకిష్టారెడ్డి వివరించారు. కళాశాలల్లో క్వాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకడమిక్ పార్టిసిపేషన్, రీసెర్చ్ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఛైర్మన్ సూచించారు. వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలు-సూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పని సరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆ తీయటి గొంతుకలు ..హనీ ట్రాప్


- మోసపోయారో గుల్ల అవుతారు జాగ్రత్త
- అమ్మాయిల పేరుతో సైబర్ మోసాలు
- ప్రజలను హెచ్చరించిన కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్, మార్చి17( వెలుతురు):**
మారుతున్న పరిస్థితుల రీత్యా ఒంటరితనానికి అలవాటు పడే యువతను లక్ష్యంగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలపై ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు హైదరాబాద్ నగర పోలీసులు. ఇందులో భాగంగా 'ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు అంటూ యువతను ఆకర్షించే రీతిలో సోషల్ మీడియాలో వస్తోన్న యాడ్స్‌పై ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. అయితే, దీని వెనుక ఉన్నది తీయని మాటలు కాదు.. నిలువునా దోపిడీ చేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలే. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చు కున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయి. ఇక రాత్రిపూట సరదాగా మాట్లాడదామని వీడియో కాల్ చేశారో.. ఇక అంతే. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ సెక్స్‌టార్షన్‌కు దిగుతారు. దీంతో పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయం అన్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు అవ్వరు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువును దెబ్బతీసే భారీ కుట్ర దాగి ఉందని తెలుసుకోండి. క్షణికావేశంలో గుర్తు తెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు. రాత్రి వేళల్లోనే ఈ తరహా యాడ్స్ దర్శనమిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఈ తరహా సైబర్ వలలో చిక్కుకుంటే.. పరువు పోతుందేమోనని భయపడొద్దు. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి. లేదా వెబ్‌సైట్‌లోనైనా ఫిర్యాదు చేయండి. బీ అలర్ట్' అని సజ్జనార్ సూచించారు.

# స్త్రీ శక్తి పథకం విజయవంతం స్ఫూర్తి

- దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు పథకం
- నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



**అమరావతి, మార్చి17( వెలుతురు):**
ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ తీసుకు వచ్చిన స్త్రీ శక్తి పథకం విజయవంతం కావడంతో దీనిని స్ఫూర్తిగా తీసుకున్న ప్రభుత్వం దివ్యాంగులకు కూడా పథకం అమలుకు ఆలోచన చేసింది. తాజాగా రాష్ట్రంలోని దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఈ పథకాన్ని బుధవారం.. ఉగాది పండగ కానుకగా సీఎం చంద్రబాబు నాయుడు మంగళగిరిలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొనున్నారు. ఈ పథకం ప్రారంభించిన తర్వాత.. దివ్యాంగులతో కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్, మాధవ్ తదితరులు ఆ బస్సులో ప్రయాణించనున్నారు. అనంతరం దివ్యాంగులకు సీఎం చంద్రబాబు ఆత్మీయ విందు ఇవ్వనున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. అనంతరం ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులతో కలిసి వారు ప్రయాణించనున్నారు. ఆ తర్వాత దివ్యాంగులతో కలిసి ప్రజా ప్రతినిధులు భోజనం చేయనున్నారు. రాష్ట్రంలోని 11.16 లక్షల మంది దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుకగా ఈ పథకాన్ని ప్రారంభించనుంది. ఈ దివ్యాంగ శక్తి పథకం ద్వారా 12.76 లక్షల మంది దివ్యాంగులతోపాటు వారి వెంట వచ్చే సహాయకులకు లబ్ధి చేకూరనుంది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు సహాయకులుగా వచ్చే వారికి 50 శాతం టిక్కెట్ రాయితీని ఈ పథకం ద్వారా కల్పించనుంది. 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు ఈ పథకం వర్తించనుంది. 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు ఈ 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రభుత్వం విస్తరించింది. ఈ పథకం అమలు కోసం ఏడాదికి రూ.207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. స్త్రీ శక్తి బస్సుల్లో దివ్యాంగులకు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇప్పటికే స్త్రీ శక్తి పథకం ద్వారా 52 కోట్లకు పైగా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రూ.1,826 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చును భరిస్తుంది. డిసెంబర్ 3వ తేదీ దివ్యాంగుల దినోత్సవం. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్య పథకాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఉగాది పండగకు ఒక రోజు ముందు దివ్యాంగ శక్తి పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది.

# అమెరికాతో కాల్పుల విరమణ

- తోసిపుచ్చిన మొజ్తబా ఖమేనీ
- చికిత్స కోసం రష్యా వెళ్లినట్లు ప్రచారం



**టెహ్రాన్ మార్చి17( వెలుతురు):**
మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల సడలింపు, అమెరికాతో కాల్పుల విరమణకు గల అవకాశాలను ఇరాన్ కొత్త సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునే విషయంలో కఠిన వైఖరి ప్రదర్శించేందుకే ఆయన కట్టుబడి ఉన్నారు. ఉద్రిక్తతల సడలింపు, కాల్పుల విరమణకు అవకాశాలపై రెండు మధ్యవర్తి దేశాలు చేసిన ప్రతిపాదనను మొజ్తాబా తోసిపుచ్చినట్టుగా ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారని 'రాయిటర్స్' వార్తా సంస్థ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనని ఇరాన్ విదేశాంగ విధానంపై జరిగిన తొలి సమావేశంలో మొజ్తాబా కఠిన నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే ఆ సమావేశానికి మొజ్తాబా స్వయంగా హాజరయ్యారా లేదా అనేదానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. మొజ్తాబా నాయకత్వ పగ్గాలు చేపట్టిన అనంతరం విడుదల చేసిన తొలి లిఖిత పూర్వక ప్రకటనలోనూ యుద్ధంలో పలువురిని పొట్టనపెట్టుకున్నందుకు అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించారు. శత్రువు నుంచి పరిహారం పొంది తీరుతామని అన్నారు. పరిహారం ఇవ్వడానికి నిరాకరిస్తే వాళ్ల ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని, కాని పక్షంలో ఆస్తులు ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు. ఇంతవరకూ కొంతమేరకు నష్టం చేకూర్చినా అంతిమ లక్ష్యం పూర్తయ్యేంత వరకూ ప్రతీకారమే తమ ప్రాధాన్య క్రమంగా ఉంటుందన్నారు. యుద్ధంలో ఖమేనీ సహా ప్రజలు చిందించిన రక్తానికి ప్రతీకారం తీర్చుకోకుండా వదలేది లేదని చెప్పారు. ఫిబ్రవరి 28న టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన తొలి దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తాబా రష్యాలో చికిత్స పొందేందుకు వెళ్లినట్టు తెలుస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల ఫోన్ చేశారని, మొజ్తాబాకు రష్యాలో వైద్య చికిత్స అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మొజ్తాబా రష్యా మిలటరీ విమానంలో మాస్కోకు మంగళవారం నాడు బయలుదేరి వెళ్లినట్టు కథనాలు వెలువడుతున్నాయి.

# మేం చేస్తున్న పనులకు ధన్యవాదాలు చెప్పాలి: కోమటిరెడ్డి

**హైదరాబాద్, మార్చి17( వెలుతురు):**



కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన జవాబిచ్చారు.

# కేంద్ర నిధుల కోసం పోరాడండి

- విభజన హామీల కోసం పట్టుపట్టండి
- ఎంపీలతో జితేందర్ రెడ్డి ప్రత్యేక సమావేశం

**న్యూఢిల్లీ, మార్చి17( వెలుతురు):**
ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పీ. జితేందర్ రెడ్డి అందుబాటులో ఉన్న ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎంపీలు కేంద్రం నుంచి నిధులు రాబట్టేలా కృషి చేయాలని సూచనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అద్వైత్ కుమార్ సింగ్ ఐఏఎస్ నూతనంగా సెక్రటరీ కోఆర్డినేషన్ హోదాలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం ఈ సమావేశం జరిగింది. సమావేశంలో కీలక అంశాలపై చర్చ జరిగింది. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులపై ప్రత్యేక చర్చ జరిగింది. ముఖ్యంగా విభజన హామీల అమలు, తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఏ.పీ. జితేందర్ రెడ్డి.. ఎంపీలకు వివరించారు. అలాగే ఎంపీల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి నుంచి సలహాలు స్వీకరించారు. వీలైనంత వరకు తెలంగాణ ప్రజలకు మేలు జరిగేలా ఎంపీలు కృషి చేయాలని సూచించారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర కీలక అంశాలపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. వీలైనంత త్వరగా పెండింగ్ సమస్యలు పరిష్కారం అయ్యేలా ఎంపీలు కృషి చేయాలని ఏ.పీ. జితేందర్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయల్, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, తెలంగాణ భవన్ అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరల పేరిట బీజేపీ మోసం ప్రతి ఇంటి బడ్జెట్‌ను కూల్చేసిన విధానం

**- డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణా ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 17:** దేశంలో వంటగది మంట నేడు ఆర్థిక మంటగా మారింది, ఎల్పీజీ సిలిండర్ ధరలు సామాన్య ప్రజలకు అందని స్థాయికి చేరడం యాదృచ్ఛికం కాదు, బీజేపీ ప్రభుత్వ విధానాల ప్రత్యక్ష ఫలితం. ఒకప్పుడు సబ్సిడీతో అందుబాటులో ఉన్న గ్యాస్‌ను సంస్కరణలు పేరుతో క్రమంగా మార్కెట్‌కు అప్పగించి, సబ్సిడీలను తగ్గించి, ధరలను వరుసగా పెంచడం ద్వారా ప్రజలపై భారీ భారాన్ని మోపింది. పార్లమెంట్‌లో గణాంకాలు చూపిస్తూ సబ్సిడీలు ఉన్నాయి, ధరలు నియంత్రణలో ఉన్నాయి అని చెప్పే ప్రభుత్వం, బయట ప్రజలు ఎదుర్కొంటున్న కఠిన వాస్తవాన్ని పూర్తిగా దాచేస్తోంది. కుటుంబాలు గ్యాస్ రీఫిల్ కోసం కూడా ఆలోచించే పరిస్థితి, పేదలు మళ్లీ కట్టెల వంటకు వెళ్తున్న పరిస్థితి నిజంగా ఉంది. ఉజ్వల పథకం పేరుతో కనెక్షన్లు ఇచ్చామని చెప్పడం సరిపోదు; వాటిని ఉపయోగించగలిగే స్థితి కల్పించకపోతే అది సంక్షేమం కాదు, ప్రచారం మాత్రమే. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ఈ అంశంపై గట్టిగా పోరాడుతూ ధరలు తగ్గించాలి, సబ్సిడీలు పునరుద్ధరించాలి, ధరల నిర్ణయంలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తోంది, అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు తీసుకుంటూ ప్రత్యామ్నాయ పాలనను చూపిస్తున్నాయి. బీజేపీ చేస్తున్నది మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ముందుగా ధరలు పెంచడం, తర్వాత చిన్న ఉపశమనం ఇచ్చి ప్రచారం చేయడం; ఇది పాలన కాదు, ప్రజలను మోసం చేసే రాజకీయ వ్యూహం. వంట గ్యాస్ విలాసం కాదు, ప్రతి కుటుంబానికి అవసరమైన జీవన హక్కు, ఈ హక్కును భారంగా మార్చిన బీజేపీ ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలు తగ్గించి, సబ్సిడీలను పునరుద్ధరించాలి, లేకపోతే వంటగదిలో మొదలైన ఈ అసంతృప్తి దేశ వ్యాప్తంగా ప్రజా ఆగ్రహంగా మారడం ఖాయం.

## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం


చులకన అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'మీరు పావలా వడ్డీ ఇవ్వలేదు.. మేము ఇస్తున్నాం. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారు. ఈరోజు కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఎంవోయూ, పెట్టుబడులపై ఆయన వివరణ ఇచ్చారు. సిఎం పదేపదే ఢిల్లీకి వెళుతున్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. కేంద్రంతో కొట్లాడి అయినా నిధులు తెచ్చి, రాష్ట్రాన్ని బాగు చేస్తామని అన్నారు. ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేముందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని.. దిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నామన్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నోసార్లు దిల్లీకి చక్కర్లు కొట్టారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసా÷–లంల్గ÷నా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఎ÷–లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

## మీ సాయం మాకక్కర లేదు..

**వాషింగ్టన్, మార్చి17( వెలుతురు):**

హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి



**పెద్దపల్లి,మార్చి17( వెలుతురు):** రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. ఈ ఘటన పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలో పెద్దపల్లి – రామగుండం రాజీవ్ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, బసంత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్ (47), రజిత (40) దంపతుల కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటోంది. ఆమెను చూసేందుకు వారు కారులో వెళ్లారు. కలిసిన అనంతరం తిరిగి స్వస్థలానికి వెళుతున్న క్రమంలో బసంత్‌నగర్ గ్రామ శివారు వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు.

# పోలీసింగ్ అంటే మొకరిల్లటమా...!?

- కళ్యాణ కంత్రి లీలలు...!
- పదనలుగు మంది జర్నలిస్ట్ లపై గతంలో కేసులు...!?
- నేడు బీసీ ఎస్సై పై కక్ష సాధింపు...!
- దొరగిరిలో మనోడిది అందెవేసిన చేయి...!
- ఎస్సై నా ఇంటికి వచ్చి మోకరిళ్ళాలి...!?
- లేదంటే ఏ స్థాయి అధికారినైనా నా చెప్పు చేతల్లోకి తీసుకుంటా...!
- సస్పెండ్ చేపిస్తా... సంగతి చూస్తా...!
- ఛార్జ్ మెమో ఇవ్వగలిగినా సస్పెన్షన్ వెనుక చక్రం తిప్పినది ...!
- మరి ఆ ఉన్నత అధికారికి చెడు నేర్పింది ఎవరు...!?



ఇలా ఉండాలా..?



ఇలా ఉంటారా..?

**మహబూబ్ నగర్ జిల్లా వెలుతురు మార్చి 17, 2026:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పోలీసింగ్ అంటే మోకరిళ్ళటమే అనే ఓ ఘటన చోటుచేసుకుంది. ఓ బీసీ వర్గానికి చెందిన ఎస్సైని సస్పెండ్ చేయించానని ఆ ఎస్సై పై ఉన్న ఓ ఉన్నత అధికారితో అంటకాగిన కంత్రి రావ్ రెచ్చిపోతున్న ఘటన పోలీస్ యంత్రాంగాన్ని చిన్నబుచ్చే ఘటన అనేలా ఉంది. ఆ దొర గారి నక్కవినయం గతంలో అక్రెడిటేషన్ లేదని పదనాలుగు మంది జర్నలిస్ట్ లపై సైతం కేసులు పెట్టించానని ప్రగల్బాలు సైతం పలికిన తీరు నేడు కొన్ని పరిస్థితులు నిజమా అనే అనిపించేలా చేశాయి. జస్ట్ ఛార్జ్ మెమో ఇవ్వగలిగితే చాలు అనే ఒక ఇష్యు లో ఓ ఎస్సై సస్పెన్షన్ వెనుక మనోడే చక్రం తిప్పాడని ఓ ఉన్నత అధికారితో ఉన్న సక్యతతో ఇలా ఆ ఎస్సై పై మరో ఉన్నత అధికారికి చెవులు ఊదించాడని భోగట్ట. మరి ఆ దొరపై చర్యలు లేకపోతే పరిస్థితి క్యాన్సర్ మహమ్మారీలా చాలా వేగంగా మరింత ప్రమాదం జరక్క పోలేదు. కావున అధికారులు సైతం తప్పటడుగులు వేస్తే అది ఎంతైనా సామాజిక తప్పిదంగా మారే అవకాశాలు సైతం ఉంటాయి. ఎందుకంటే ఆ చెవిలో చెప్పిన అంశాలు రేపు మీపై కూడా ఇంతే ప్రభావం చూపవన్న గ్యారంటీ లేదు. మేము తెలివైన వారం అని దిగువ స్థాయి బీసీ అధికారులపై బ్యాక్గ్రౌండ్ లేని వారిపై ఇలాంటి చర్యలకు అవకాశాలు తీసుకుంటామంటే రేపు మీ పై చెప్పే వారు సైతం ఉండొచ్చు అనేది జర్నలిజం చెప్పే హెచ్చరిక. గత ప్రభుత్వంలో రెచ్చిపోయిన మూకలు నేడు ఎట్టి పరిస్థితి ఎదుర్కొంటున్నాయో తెలియనిది కాదు. మరి అదే బ్యాక్ గ్రౌండ్ ఉన్న మరో అధికారిని తాకగలరా..! అని బీసీ ఎస్సి ఎస్టీ లు ప్రశ్నించే పరిస్థితి కి దిగజారకండి పోలీసింగ్ ని దిగజార్చనివ్వకండి.

# రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

**అమరావతి, మార్చి17( వెలుతురు):**

రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందుల్లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్ నుంచి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ప్యానిక్ అవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌లను పెంచేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంచి, మెరుగైన పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷–ష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్ఠంగా పెంచే అవకాశాలను పరిశీలించాలని మఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సమావేశానంతరం ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని పైరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 100 శాతం ప్రజలకు గ్యాస్ అందిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉండేవారని.. ఇప్పుడు వారు ఆరోగ్యశాఖ కిందకు మారినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉందని... వాటిని త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా ఉక్కుపాదం మోపుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.రాష్ట్రంలో గృహావసరాల కోసం ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటుగా 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 2.92 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి ఒక్కసారిగా ఎక్కువ బుకింగ్‌లు చేయడంతో సర్వర్లు జామ్ అవుతున్నాయని చెప్పారు. కేంద్ర నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాతే మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు అనుమతి ఉంటుందని గుర్తు చేశారు.బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఓటీపీ ద్వారా మాత్రమే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే 616 కేసులు నమోదు చేసి 2500 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు యాప్, ఫోన్ కాల్, వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని మంత్రి సూచించారు. ÷–రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో చిచ్చు పెడుతున్నదే ఎమ్మెల్యే సంజయ్

సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో కలిసి పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు ఆఫర్ ఇచ్చాడని సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చెప్పారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు?, తనను ఎలా కలిసి రమ్మంటారని మండిపడ్డారు. నేను ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. కాంగ్రెస్‌ని వదిలిపెట్టడానికి సంజయ్ కారణం అవుతారు. సంజయ్‌ని ఎవరు ప్రోత్సహిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని నేను అనుకోవడం లేదు. కాంగ్రెస్‌లోని మిత్రులు ఈ విషయంలో మాట్లాడు తున్నారు. నాకు కార్యకర్తల అభిప్రాయాలు ముఖ్యం. కాంగ్రెస్ అధిష్టానంది కూడా బాధ్యతే. నేను పార్టీని వీడటంలో సంజయ్‌ది ఒక్కటే పాత్ర కాదు. ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం ఉంది.. అసంతృప్తి ప్రజల్లో ఉంది. నేను పార్టీని వీడితే పార్టీ అగుతుందా?, ఒక్కడు పోతే ఆగదు. కాంగ్రెస్లోకి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే పరిష్కారం. పార్టీ వారిని దూరం పెడుతుందా?. అలా అయితే కాంగ్రెస్లో సమస్యకు పరిష్కార మార్గం వచ్చినట్టే' అని జీవన్ రెడ్డి సూచించారు. సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారని.. కాంగ్రెస్‌లో కలిసి పనిచేయాలని సంజయ్ అంటున్నారన్నారు. తనకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు? అని.. తాను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా? అని ప్రశ్నించారు. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా? అని.. తమ పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయే అని జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అసెంబ్లీ లాబీల్లో చేసిన వ్యాఖ్యలపై జీవన్ రెడ్డి స్పందించారు. 'జగిత్యాల ఎమ్మెల్యే తనతో కలిసి పనిచేయాలని నాకు ఆఫర్ ఇచ్చారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు.. నన్ను ఎలా కలిసిరమ్మంటున్నారు. స్పీకర్ ఏమో సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని అంటారు.. సంజయ్ ఏమో కాంగ్రెస్‌లో కలిసి పని చేయాలని అంటారు. సంజయ్ ఎవరు నాకు ఆఫర్ ఇవ్వడానికి?. నేను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా?. వీడాలని కోరుకోవడం లేదని ఎలా అంటారు?. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా?. మా పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయ్. ఏ పార్టీనో ముందు నువ్వు తేల్చి చెప్పు సంజయ్ అంటూ జీవన్ రెడ్డి ప్రశ్నలు కురిపించారు. నువ్వు ఎవరు కలిసి పనిచేయాలని అంటావు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం ఎంత బాధగా ఉంటది?. ఎంత బాధ ఎంత ఇబ్బందిగా ఉంటే పార్టీ వీడాలనే నిర్ణయం తీసుకుంటామో అర్థం చెస్కోవాలి' అని జీవన్ రెడ్డి అన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం నాది. బలహీన వర్గాల మహిళకు కేటాయించిన చైర్మన్ సీట్ నుంచి అడబిడ్డను దించేశావు. సంజయ్ చదువుకున్న వాడు, చట్టం కూడా తెలుసు. జగిత్యాల అభివృద్ధి కోసం అని 20 నెలలుగా చెబుతున్నారు. యావర్ రోడ్డు విస్తరణ ఏమైంది సంజయ్. యావర్ రోడ్డు విస్తరణ అభివృద్ధిలో భాగం కాదా?. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు అభివృద్ధిలో లేవా?. నేను తీసుకునే ప్రతీ నిర్ణయం రాజ్యాంగ బద్ధంగా ఉంటుంది. రాజ్యాంగాన్ని పాటించని వ్యక్తి నాకు నీతులు చెప్తున్నాడు. నేను కాంగ్రెస్లోనే ఉండాలని అనుకుంటున్నా. కానీ ఉండే పరిస్థితులు లేకపోతే ఏమి చేస్తాం. ఇంట్లో వుడుము వస్తే ఇల్లు ఇడిచి పెడతాం.. అలాగే సంజయ్ ఉడుము లాగా వచ్చి కాంగ్రెస్లో చేరాడు. ప్రజలు ఎవరికి ఏ బాధ్యత ఇస్తే అది నిర్వర్తించాలి. ప్రజలు ఇచ్చిన బాధ్యత నిర్వర్తించకుండా ఉంటే వారు ఆ పదవికి అనర్హుడు' అని జీవన్ రెడ్డి మండిపడ్డారు.

## అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

**కాబూల్, మార్చి17( వెలుతురు):**

అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియోలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని అఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందని పేర్కొన్నారు. దాడుల్లో 400 మంది వరకు మరణించారని.. సుమారు 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. వాటిని అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷–గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఎ÷–గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఎ÷–గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఎ÷–గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

# వివేకా హత్యకేసును తప్పుదారి పట్టించే యత్నం

**- హత్యకేసు నిందితులతో మీడియా సమావేశాలా?**

**- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్**



**అమరావతి, మార్చి17( వెలుతురు):** మంత్రి వివేకా హత్య కేసులో నిందితులను కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. సొంత బాబాయ్ హత్య కేసులో నిందితులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం జగన్ దిగజారుడు తనానికి పరాకాష్ఠ అని విమర్శించారు. 'అబద్ధాల పునాదుల మీద పుట్టిన పార్టీ వైసీపీ.. బాబాయ్‌ను చంపింది ఎవరో తెలిసినా సాక్ష్యాలు చెరిపేయడమే మీ పనా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుండెపోటు థియరీ నుంచి గొడ్డలి వేటు వరకు గంటకో మాట మార్చిన 'జగన్నాటకం' గూగుల్ టేకవుట్‌లో బట్టబయలైందని మంత్రి వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ వద్దని, నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడటానికి బాంబులతో బెదిరిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న వివేకా కన్నకూతురు సునీతమ్మపై అక్రమ సంబంధాల ముద్ర వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ కావాలన్నారు.. అధికారంలోకి వచ్చాక సీబీఐని తరిమికొట్టారు, ఇదేనా మీ నీతి' అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. త్య జరిగిన చోట రక్తపు మరకలను చెరిపేసి ఇంకో రకంగా చిత్రీకరించిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. 'హత్య కేసును ఆస్తి, అక్రమ సంబంధాల వైపు తిప్పడం.. అసలు నిందితులను కాపాడేందుకేనా ఈ డ్రామా?' అని ప్రశ్నించారు. 15 రోజులకోసారి పక్క రాష్ట్రం నుంచి వచ్చి 3 గంటలు అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మే రోజులు పోయాయని అన్నారు. ప్రజల మీద, కుటుంబ సభ్యుల మీద ప్రేమ లేదని.. కేవలం దోచుకున్న వారిని కాపాడటమే వైసీపీ ఏకైక అజెండా అని ఆరోపించారు. ఒక ఆడబిడ్డ న్యాయం కోసం ఏడుస్తుంటే ఆమెపైనే నిందలు వేయడం రాజకీయ సంస్కృతా అని నిలదీశారు. 'అరాచకాలు, హత్యలు చేశారు కాబట్టే ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు.. అది గుర్తుపెట్టుకోండి' అంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. అందుకే మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిజాలు దాచేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని మంత్రి అనగాని ఆరోపించారు. చెల్లెలు సునీత బాధపై స్పందించకుండా నిందితుడితో ప్రెస్‌మీట్ పెట్టిస్తారా?అని ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపిన వారిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు.ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాస్తవాలను జగన్ ఏమార్చారు. అధికారం పోయాక బలప్రదర్శన చేస్తున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదు. జగన్ చెప్పే అబద్ధాలు నమ్మకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు' అని అనగాని అన్నారు. ఈ సందర్భంగా వివేకా హత్యపై జగన్, అవినాష్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాసిరకం భోజనం

**- ఆరోపణలు రావడంతో లోకేశ్ ఆకస్మిక తనిఖీ**



**విజయవాడ, మార్చి17( వెలుతురు):** మైలవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం భోజనం అంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో తారక రామానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంపై విద్యార్థులను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. 'భోజనం రోజూ బాగోవడం లేదా? ఆ ఒక్క రోజే బాగోలేదా?' అంటూ విద్యార్థులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. పాఠశాలలో భోజనం బాగుంటుందంటూ మంత్రికి బదులిచ్చారు విద్యార్థులు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆ తర్వాత సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం ఆయన సందర్శించారు. అందులోని చిన్న పిల్లలతో లోకేశ్ ముచ్చటించారు. ఆ తర్వాత పాఠశాల స్థితిగతులపై మైలవరం ఎంఈవో, హెడ్‌మాస్టర్‌తో లోకేశ్ మాట్లాడారు. ఆ క్రమంలో తనతో పాటు తెచ్చిన నివేదికపై ఎంఈఓతో లోకేశ్ చర్చించినట్లు తెలుస్తోంది. న్నతాధికారులు, పార్టీ శ్రేణులుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రి లోకేశ్ ఈ పాఠశాలను సందర్శించారు. లోకేశ్ పర్యటనపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కూ ఎలాంటి సమాచారం అందలేదని తెలుస్తోంది. మంత్రి లోకేశ్ రాకను తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు మైలవరానికి పరుగులు తీశారు.

# రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

**- మండిపడ్డ మాజీమంత్రి సాకే శైలజానాథ్**



**అమరావతి, మార్చి17( వెలుతురు):** ఏపీలో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అనే రీతిలోనే ఇప్పటికీ చంద్రబాబు ఆలోచిస్తున్నారంటూ దుయ్యబట్టారు. సగటున రోజుకు 8 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభమే ఈ ఆత్మహత్యలకు కారణం. విపత్తులు వచ్చినా ప్రభుత్వం మాటలు తప్ప.. లబ్ధి చేకూర్చడం లేదు. ఎన్నికల ముందు రైతులకు, రైతు కూలీలకు అనేక హామీలు ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొర మినహా ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేవని అన్నారు. మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా ధరల స్థిరీకరణ నిధికి రూ.3,000 కోట్లు కూడా కేటాయించలేదు. వైఎస్సార్, జగన్ పరిపాలనలో రైతే రాజు అన్నట్లుగా పరిస్థితులు ఉండేవి. క్రాప్ ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించక రైతులు విపత్తులతో నష్టపోయారు. అన్నంపెట్టే రైతుల సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం వెంటనే స్పందించాలి. చిన్న, సన్నకారు రైతాంగాన్ని ఆదుకోవాలి' అని సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు.

# డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపి

**- పార్లమెంట్ చరిత్రలోనే ఇదే తొలిసారి**

**- అయినా ఎంపి పుట్టా మహేశ్‌పై చర్యలేవీ**

**- ఇదే చంద్రబాబు తరహా రాజకీయాలు**

**- మండిపడ్డ వైసిపి అధినేత జగన్**



**అమరావతి, మార్చి17( వెలుతురు):** పార్లమెంట్ చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ పుట్టా మహేషే అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. ఈ వ్యవహారం పుట్టా మహేష్‌తో మొదలై, పుట్టా మహేష్‌తో ఆగిపోలేదన్నారు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం అని మండిపడ్డారు. తప్పు చేసిన వారిపట్ల చంద్రబాబు చర్యలు తీసుకోలేదని, అందుకే రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందాలు జరుగుతున్నాయని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం అత్యాచారాలు, మోసాలపై కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. కోనేటి ఆదిమూలం మహిళపై లైంగిక దాడిచేస్తే చర్యలు లేవని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డాడు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం. ఒక పాలకుడిగా ఆయన వ్యవహరించలేదు. తప్పు చేసిన వారిపట్ల తయన చర్యలు తీసుకోలేదు. అందుకనే విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అత్యాచారాం చేశారని, ఆపై మోసం చేశారని బాధితురాలు స్వయంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. దానిపై కమిటీలు అంట. కోనేటి ఆదిమూలం మహిళ మీద దారుణమైన లైంగిక దాడిచేస్తే పంచాయితీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. మహిళలతో అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీదా నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీదా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా.. నో యాక్షన్' అంటూ వైఎస్ జగన్ ÷ర్ అయ్యారు. 'ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే నో యాక్షన్. ఇలాంటి వాటికి వత్తాసు పలికే భావన సీఎం చంద్రబాబుకు ఉంది కాబట్టే.. ఇలాంటివి జరుగుతున్నాయి. తన కొడుకు స్విమ్మింగ్ పూల్స్ వద్ద తాగుతూ, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చూస్తే నో యాక్షన్. తన బావమరిది అమ్మాయిలకు ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలని అని బహిరంగంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని చంద్రబాబు అన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. లాగి చెంపకేసి ఒక్కటి పీకాల్సింది పోయి... చేసిందేమిటన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం

**- మత్తు మందు ఇచ్చి దోపిడీ చేసిన బంధువు**

**- 24 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, మార్చి17( వెలుతురు):** బంధువే కదా ఆశ్రయమిస్తే రాబంధువుగా మారి దోచుకున్నది. ఇంట్లో చోటిచ్చిన పాపానికి బంగారు నగలు, డబ్బు అంతా ఊడ్చుకెళ్లింది. ఆ కిలాడీ లేడీ అంతర్గతంగా వేసిన స్కెచ్ గుర్తు పట్టని ఆ దంపతులు.. సొమ్ము పోయిన తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. సీన్ కట్ చేస్తే జస్ట్ 24 గంటల్లోనే కిలాడీ లేడీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లో జరిగింది. బీహెచ్‌ఈఎల్ కాలనీ పరిధిలోని ఆదర్శనగర్‌లో పురోహితులైన యర్రవల్లి మణికంఠశర్మ, హేమబిందు దంపతుల ఇంటికి వచ్చింది ఓ మహిళ. ఆమె పేరు చెరకుపల్లి లక్ష్మీ స్వరాజ్. తాను తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నానని, ఉండటానికి చోటు లేక ఇబ్బంది పడుతున్నానని ప్రాధేయపడింది. బంధుత్వంపై ఉన్న గౌరవం.. ఆమె పరిస్థితిపై ఉన్న జాలితో ఆ దంపతులు ఆమెకు తమ ఇంట్లోనే ఉండేందుకు ఆశ్రయం ఇచ్చారు. కొన్ని రోజులు.. ఆ దంపతుల నమ్మకాన్ని గెలుచుకుంది లక్ష్మీస్వరాజ్. వారి ఇంట్లో ఒక మనిషిగా ఉన్నట్లుగానే మెదిలింది. కానీ ఆ తర్వాత ఆమె తన కన్నింగ్ ఆలోచనలకు తెరతీసింది. ఇంట్లో ఉన్న విలువైన ఆభరణాలపై కన్నేసింది. మార్చి 13న వాటిని కొట్టేసేందుకు ప్లాన్ చేసింది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం.. ఆ దంపతులకు నిమ్మరసంలో మత్తు పదార్థం కలిపి ఇచ్చింది. ఆ పానీయం తాగిన కొద్దిసేపటికే మణికంఠశర్మ, హేమబిందు ఇద్దరూ స్పృహ కోల్పోయారు. వారు అపస్మారక స్థితిలోకి వెళ్లగానే.. లక్ష్మీస్వరాజ్ తన ముఠా సభ్యులైన పర్వతం కిరణ్‌కుమార్, కోనపర్తి యశ్వంత్, భారడి దీపక్, శివను ఆ ఇంటికి రప్పించింది. ముఠా సభ్యులతో కలిసి ఇంట్లోని అల్మారాలను బద్దలుకొట్టి దాదాపు 30 తులాల బంగారం, 2.3 కిలోల వెండి, 3 ఖరీదైన సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. బాధితులు స్పృహలోకి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం.. లక్ష్మీస్వరాజ్ కనిపించకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు వెంటనే బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీ, నిందితులు వాడిన వాహనాల నంబర్లు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే ప్రధాన నిందితురాలు లక్ష్మీస్వరాజ్‌తో పాటు మిగిలిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి దోచుకెళ్లిన పూర్తి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంధువులైనా, తెలిసిన వారైనా సరే ఇంటికి వచ్చినప్పుడు పూర్తి జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ఆర్థిక స్థితిగతులు, బంగారం ఎక్కడ దాస్తారో వంటి వ్యక్తిగత విషయాలను ఎవరికీ వెల్లడించవద్దని కోరారు.

# ప్రతిపక్ష పార్టీ అయ్యేలా కవిత వ్యూహమా?

**హైదరాబాద్, మార్చి17( వెలుతురు):** ఐయామ్ వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్. ప్రజల గొంతుగా నిలబడతా. ఎప్పుడో ఓసారి తెలంగాణకు ముఖ్యమంత్రిని అయి తీరుతా. జాగృతి అధ్యక్షురాలు కవిత స్టేట్‌మెంట్స్ ఇవి. బీఆర్ఎస్‌ను వీడినప్పటి నుంచి ప్రత్యేక రాజకీయ ఎజెండాతో ముందుకెళ్తున్న కవిత.. ఓవైపు పార్టీ ఏర్పాటు కోసం కసరత్తు చేస్తూనే..అసలు సిసలు ప్లాన్‌ను ఇంప్లిమెంట్ చేస్తున్నారు. పరిస్థితులను బట్టి..పొలిటికల్ ఈక్వేషన్స్ బేరీజు వేసుకుని..ఆల్ ఆఫ్ సడెన్‌గా ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టారు. వరుస కార్యక్రమాలు, మెరుపు ధర్నాలు, దీక్షలతో అధికార కాంగ్రెస్ తీరుపై నిరసన తెలుపుతూనే..ఇటు బీఆర్ఎస్, బీజేపీపై విమర్శల దాడిని కంటిన్యూ చేస్తున్నారు. ఓ రకంగా తానే అసలైన ప్రతిపక్షం అన్న లెవల్‌కు ఎదిగేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారట కల్వకుంట్ల కవిత.త్వరలోనే రాజకీయ పార్టీని ప్రకటించేందుకు రెడీ అవుతున్నారు కవిత. అంతలోపే అంశాల వారీగా తనదైన శైలితో పోరాటం మొదలుపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై ఫైట్ చేస్తూ వస్తున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా తన దృష్టికి వచ్చిన ప్రతి అంశంపై రియాక్ట్ అవుతున్నారు కవిత. హైదరాబాద్ నుంచి మొదలు రాష్ట్రంలో ఎక్కడ ప్రజల సమస్యలు ఉంటే అక్కడికి వెళు_న్నారామె. అంశాన్ని బట్టి నిరసనలు, ధర్నాలు



చేస్తూ..వార్తల్లో నిలుస్తున్నారు. ఇక సమస్య తీవ్రతను బట్టి మెరుపు దీక్షలు, చివరికి ఆమరణ నిరాహార దీక్షకు కూడా దీగడంతో కవిత రాజకీయ వ్యూహంపై అసక్తికరమైన చర్చ మొదలైంది.జనం బాట పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన కవిత..ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగుల కోసం ఇందిరా పార్క్ దగ్గర దీక్ష చేశారు కవిత. హైదరాబాద్‌లో మూసీ పక్కన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమంగా నిర్మాణాలు చేస్తోందని మెరుపు ధర్నాతో నిరసన తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మహిళలకు 2,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ ముందు ధర్నా నిర్వహించారు కవిత. జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తి రైతుల సమస్యలపై కలెక్టరేట్ దగ్గర ప్రొటెస్ట్ చేశారు. రైతు సంఘర్షణ సభ తర్వాత కలెక్టరేట్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో, అక్కడే బైఠాయించి నిరసన తెలిపి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.లేటెస్ట్‌గా ఖమ్మం వెలుగుమట్ల బాధితుల తరపున కవిత ఏకంగా నిరాహార దీక్ష చేయడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. వెలుగుమట్ల బాధితుల ఇళ్లు కూల్చడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన కవిత..మళ్లీ అక్కడే వాళ్లకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఖమ్మంలో దీక్ష చేస్తున్న కవితను పోలీసులు హైదరాబాద్ తరలించినా..దీక్షను కొనసాగించారు. చివరికి ప్రభుత్వం వెలుగుమట్ల బాదితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో మూడు రోజుల నిరాహార దీక్షను విరమించారు కవిత. ఇలా వరుసగా ప్రజా సమస్యలపై నిరసనలు, పోరాటాలు, దీక్షలు చేయడం వెనుక ఆమె రాజకీయ వ్యూహం ఏమై ఉంటుందన్న చర్చ మొదలైంది. అంత ఆశామాషీగా కవిత ఇదంతా చేయడం లేదని, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని చెబుతున్నారు.వచ్చే నెలలో రాజకీయ పార్టీని ప్రకటించబోతున్న కవిత..అంతకుముందే తనను తాను ప్రూవ్ చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, జనం పక్షాన నిలుస్తున్నాననే ఇండికేషన్ ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ప్రతిపక్ష, విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను వెనక్కినెట్టి తాను అపోజిషన్ రోల్ ప్లే చేయాలని కవిత స్కెచ్ వేస్తున్నట్లు చెబుతున్నారు. నిరసనలు, ధర్నాలు, దీక్షలు చేయడం ద్వారా బీఆర్ఎస్, బీజేపీల కంటే ఎక్కువగా తాను జనంలో ఉంటూ పబ్లిక్ వాయిస్‌గా ఎస్టాబ్లిష్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. తానే అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నట్లు చెప్పకనే చెప్పే ప్రయత్నం చేస్తున్నారట కవిత. రాజకీయ పార్టీ పెట్టాక మరింత దూకుడు పెంచి బీఆర్ఎస్, బీజేపీకి ఆల్టర్‌నేట్ అయ్యేలా వ్యూహం అమలు చేస్తున్నారట. తెలంగాణ పొలిటికల్ సినారియోలో కవిత ప్లాన్ లు ఎంత వరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

# జనసేన వర్సెస్ టీడీపీ

**కాకినాడ, మార్చి17( వెలుతురు):** పిఠాపురం నియోజకవర్గ శాశ్వత ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ఉంటారని, ఆయన చేస్తున్న అభివృద్ధే అందుకు నిదర్శనమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో ఇప్పటికే 60,000 మందితో జనసేన ఒక బలమైన కుటుంబంగా మారిందని, త్వరలోనే లక్ష సభ్యత్వాల మార్కును చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కేవలం రాష్ట్ర స్థాయి నేత మాత్రమే కాదు, దేశ స్థాయి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబు కూడా పవన్ కళ్యాణ్ సేవలను కొనియాడుతూ, ఎంపీ వ్యాఖ్యలకు మద్దతు తెలిపారు.జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురంలో పార్టీ శ్రేణులు పండుగ వాతావరణాన్ని తలపించేలా వేడుకలు నిర్వహించాయి. ఉప్పాడ బస్టాండ్ వద్ద భారీ కేక్ కట్ చేసిన అనంతరం, పిఠాపురం నుండి గొల్లప్రోలు వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గొల్లప్రోలులో అట్టహాసంగా జెండా ఆవిష్కరణ జరిగింది. రాజకీయ వేడుకలతో పాటు సేవా నిరతిని చాటుకుంటూ, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదూరి కిషోర్ సహా భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.అయితే, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వ్యాఖ్యల వెనుక పిఠాపురం నియోజకవర్గంలో సాగుతున్న అంతర్గత రాజకీయ పోరు కారణమనే చర్చ నడుస్తోంది. ఇటీవల ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంపై టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అధికారులపై, జనసేన నేతలపై మండిపడ్డారు.



ముఖ్యమంత్రికి ప్రాధాన్యత లేని చోట టీడీపీ కార్యకర్తలకు స్థానం ఎక్కడిదని ఆయన ప్రశ్నిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూటమి నాయకులు రాష్ట్ర స్థాయిలో కలిసి ఉన్నప్పటికీ, పిఠాపురంలో మాత్రం టీడీపీ, జనసేన నేతల మధ్య 'కోల్డ్ వార్' నడుస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్మ అసహనానికి కౌంటర్ గానే ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ "శాశ్వత ఎమ్మెల్యే" వ్యాఖ్యలు చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.పిఠాపురంలో శుక్రవారం జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం చెలరేగింది. మున్సిపల్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చాలా చిన్నదిగా ఉండటంపై మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా మండిపడ్డారు. అధికారులే కూటమి పార్టీల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఇది కేవలం తనను మాత్రమే కాకుండా, మూడు పార్టీల నాయకులను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. పిలిచి అవమానించడం తగదని సూచిస్తూ, అధికారుల తీరుకు నిరసనగా ఆయన సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయారు. వర్మకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు కూడా అధికారుల వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.పిఠాపురంలో వర్మ బలమైన నాయకుడు. గతంలో ఓసారి పార్టీ టికెట్ రాకపోతే ఆయన ఇండిపెండెంట్గా పోటీ చేసి గెలిచారు. పిఠాపురం నియోజకవర్గాన్ని బలమైన నియోజకవర్గంగా మార్చారు వర్మ. అయితే రాష్ట్ర స్థాయిలో పవన్ కళ్యాణ్ తో టిడిపికి పొత్తు అవసరం. గత అనుభవాల దృష్ట్యా పవన్ కళ్యాణ్ కు ఒక నియోజకవర్గం అవసరం వచ్చింది. అంతకుముందు ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోవడంతో 2024లో జాగ్రత్త పడ్డారు. అలా పిఠాపురం పై దృష్టి పడడంతో వర్మను సైడ్ చేయాల్సి వచ్చింది. బలమైన నాయకుడు కావడంతో ఆయన సాయం తీసుకోవాలని భావించి ప్రాధాన్యమిచ్చారు వర్మకు.. అయితే బలమైన హామీతోనే అప్పట్లో వర్మ పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రచారం ఉంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రోజురోజుకు వర్మలో అసహనం పెరుగుతోంది. టిడిపి నాయకత్వం సైతం వర్మ విషయంలో నిస్సహాయతతో ఉంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పిఠాపురం నియోజకవర్గం లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. వర్మ కు ఎటువంటి నామినేటెడ్ పదవి దక్కలేదు. ఆపై పిఠాపురం నియోజకవర్గంలో అధికార పార్టీగా సరైన గౌరవం దక్కడం లేదు. ఈ తరుణంలో పిఠాపురంలో జనసేన వర్సెస్ టిడిపి అన్నట్టు పరిస్థితి మారింది. రాష్ట్రస్థాయిలో పొత్తు ఉండడం.. పవన్ కీలకంగా ఉండడం.. ఆయనకు కాదని వర్మకు పదవి ఇచ్చే అవకాశం లేకపోవడంతో రోజురోజుకు పరిస్థితి శృతిమించుతోంది. అయితే పిఠాపురంలో తనకే కాదు చంద్రబాబుకు కూడా విలువ లేదని చెప్పేందుకే వర్మ అలా చేసి ఉంటారన్న టాక్ కూడా పొలిటికల్ వర్గాల్లో ఉంది. ఇప్పటికే పిఠాపురం అనేసరికి రకరకాల వివాదం నడుస్తూనే ఉంటుంది. ఒకానొక దశలో వర్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోతారని కూడా ప్రచారం నడిచింది. పార్టీ కోసం కష్టపడిన తాను ఎందుకు గుడ్ బై చెబుతానని వర్మ ప్రశ్నించారు కూడా. అయితే తన ఆవేదనంత పార్టీ కోసమే అన్నట్టు ఇప్పుడు వర్మ ప్రవర్తన ఉంది. దీనిపై టిడిపి నాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.







## ప్రభాస్ ..ఫౌజీ దసరాకు పక్కా

### శరవేగంగా సాగుతున్న షూటింగ్

ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

## గాడ్ ఫాదర్ దర్శకుడితో పవన్ మూవీ అంటూ ప్రచారం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సినిమాలను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆయన కొత్త ప్రాజెక్టుల గురించి ఏదో ఒక వార్త హల్చల్ చేస్తూనే ఉంది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో దర్శకుడు మోహన్ రాజా, పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో ఒక భారీ సినిమా రాబోతుందంటూ వినిపించిన వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. పవర్ స్టార్‌తో సినిమా గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టమైంది. పవన్ నెక్ట్స్ లైనప్‌లో ఉన్న సినిమాల్లో ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌తో పాటు హరిహర వీరమల్లు పార్ట్ 2 కూడా ఉంది. అలాగే.. సురేందర్ రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నారు. నెక్ట్స్ పవన్ నుంచి ఇమ్మీడియేట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న సినిమా సురేందర్ రెడ్డిదే. ఓజీ, వీరమల్లు సీక్వెల్స్ ఎప్పుడు ఉంటాయనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతానికైతే.. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.




## చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

### ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్




ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.

## ఆసక్తికరంగా విశ్వనాథ్ అండ్ సన్స్ టీజర్

నువ్వు ఒక్క చిటికేస్తే నీ వయసు అబ్బాయిలు చాలా మంది ఇలా వచ్చి పడిపోతారని సూర్య చెప్పడం.. కావాలంటే ఇంకో నాలుగు చిటికెలేస్తా. నువ్వు పడు చాలు' అంటూ మమిత క్యూట్‌గా బదులివ్వడం విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు ఇదే ట్రెండ్ అవుతోంది. మనం గొప్ప అనుకున్న ప్రతిసారీ మనకన్నా గొప్పోడు ఒకడుంటాడని దేవుడు గుర్తు చేస్తాడు అంటున్నారు కథానాయకుడు సూర్య. ఇప్పుడాయన నుంచి రానున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మమితా బైజు కథానాయిక. ఈ చిత్రం జులైలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. 'సంజయ్ విశ్వనాథ్ గతంలో ఎన్నో పిస్టల్ కాంపిటేషన్స్‌లో గెలిచారు. కానీ, ఇప్పుడు వేరు. కంటి చూపుకి 20ల్లో ఉన్న ఫిట్‌నెస్ 40 దాటాక ఉండదు' అనే డైలాగ్‌తో సూర్య పాత్రను పరిచయం చేస్తూ టీజర్ సాగిన తీరు ఆద్యంతం అలరించింది. దీంట్లో మ్యాడీగా మమితా బైజు చేసిన సందడి ఆకట్టుకుంది. ఆమె వయసులో తనకంటే 20ఏళ్లు పెద్దవాడైన హీరోపై మనసు పారేసుకోవడం.. ఈ ఇద్దరి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నట్లు ఈ ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది.




## విడుదలకు ముందే దురంధర్ కలెక్షన్లు

### ప్రీరిలీజ్ కోసం 130 కోట్లు రాబట్టినట్లు ప్రచారం




బాక్సాఫీస్ వద్ద మరోసారి కలెక్షన్ల వర్షం సృష్టించేందుకు 'ధురంధర్ 2' సిద్ధమవుతోంది. రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన మోస్ట్ అవేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రికార్డులు కొల్లగొడుతోంది. 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం, కేవలం అడ్వాన్స్ సేల్స్ ద్వారానే వంద కోట్ల క్లబ్‌లో చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. పెయిడ్ ప్రివ్యూల్లోనే కోట్లు వసూలుచేస్తోంది. ఈ కలెక్షన్లు చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' ప్రభంజనం ఏ స్థాయిలో ఉండనుందో తెలుస్తోంది. భారీ అంచనాల మధ్య ఉగాదికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఒకరోజు ముందుగానే పెయిడ్ ప్రివ్యూలు ఉండనున్నాయి. దీంతో దీని టికెట్స్ హాట్‌కేకుల్లా అమ్ముడైనట్లు తెలుస్తోంది. ప్రివ్యూల ద్వారా రూ.40.54 కోట్లు, మొదటిరోజు అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.29 కోట్లు వచ్చాయని సినీ వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు ఓవర్సీస్‌లో సుమారు రూ.60 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయని సమాచారం. దీంతో మొత్తంగా ఈ సినిమా విడుదలకు రెండు రోజుల ముందే రూ.130 కోట్లు తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా 15,000 థియేటర్‌లలో ఈ సినిమాను ప్రదర్శించ నున్నారు. ఇప్పటివరకూ 4.7లక్షల టికెట్లు అమ్ముడైనట్లు తెలుస్తోంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఇది విడుదలవుతోంది. దాదాపు 3 గంటల 55 నిమిషాల నిడివి ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. నిడివి, సెన్సార్‌పై అధికారిక సమాచారం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వివాదంలో సర్కే చునర్ తేరీ సాంగ్

కన్నడ నటుడు ధ్రువ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'ఐఆ: ది డెవిల్' భారీ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని 'సర్కే చునర్ తేరి సర్కే' అనే స్పెషల్ సాంగ్ అశ్లీలంగా ఉందంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పాటపై నిషేధం విధించాలని కోరుతూ ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌తో పాటు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అత్యంత అశ్లీలంగా, అసభ్యకరంగా ఉన్నాయని, ముఖ్యంగా మైనర్లకు హాని కలిగించే విధంగా ఉన్నాయని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. యూట్యూబ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విచ్చలవిడిగా ప్రచారంలో ఉన్న ఈ పాట, పబ్లిక్ డెన్సీని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ పాటలో ఉపయోగించిన పదజాలం మరియు నృత్య రీతులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది సమాజంలో అసభ్యతను ప్రోత్సహిస్తుందని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటకు సాహిత్యం రాసిన రాకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య మరియు గాయని మంగ్లీ వంటి వారిని కూడా ఈ ఫిర్యాదులో ప్రస్తావించాడు. ఇప్పటికే ఈ అంశంపై ఢిల్లీ పోలీస్ సైబర్ సెల్‌లో కూడా విడిగా క్రిమినల్ ఫిర్యాదు నమోదైందని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ పాటను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.



# ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

**- మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్**




**లక్నో,మార్చి17( వెలుతురు):**
యుపిలో టెర్రరిస్ట్ సంబంధాలు ఉన్నవారిపై దాడులు కొనసాగుతున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో ఆన్‌లైన్‌లో సంబంధాలున్నాయనే ఆరోపణలతో 19 ఏళ్ల వైద్య విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో పనిచేస్తున్న ఐసిస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్ కార్యకలాపాలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, షహరాన్‌పూర్ జిల్లాకు చెందిన హారీష్ అలీని ఆదివారం మొరదాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఎటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. బిడిఎస్ (డెంటిస్ట్) రెండో సంవత్సరం చదువుతున్న హారీష్ అలీ, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు సెషన్, డిస్కార్ట్ వంటి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్‌ల ద్వారా ఐసిస్ సభ్యులు, సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నాడని అధికారులు పేర్కొన్నారు. ఐసిస్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి, దేశంలో ఉగ్రవాద సంస్థను బలోపేతం చేయడానికి వ్యక్తులను నియమించడం లక్ష్యంగా ఆన్‌లైన్ గ్రూపులను సృష్టిస్తున్నారని ఎటిఎస్ తెలిపింది. నిందితులు అల్ ఇత్తిహాద్ మీడియా ఫౌండేషన్ అనే పేరుతో ఒక ప్రత్యేక గ్రూపును కూడా నడిపారని, భారత్‌తో పాటు విదేశాల్లో ఐసిస్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులతో సంబంధాలు కొనసాగించారని అధికారులు తెలిపారు. లక్నోలోని ఎటిస్ పోలీస్ స్టేషన్‌లో యుఎపిఎ మరియు బిఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎటిఎస్ పేర్కొంది.

# కూకట్‌పల్లి కోటి రూపాయల దోపిడీ ఘటన

**- కళ్లల్లో కారం చల్లి దోచుకున్న దుండగులు**

**- వివరాల ఆధారంగా రంగంలోకి పోలీసులు**



**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో భారీ దోపిడీ కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో స్కూటీపై డబ్బులు తరలిస్తున్న ఇద్దరిపై దుండగులు దాడి చేసి కోటి రూపాయల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పిలర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే జరగడం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం మహ్మద్ ఖుస్రూ (42), మహ్మద్ అజీముద్దీన్ (38) అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై కోటి రూపాయల నగదును తరలిస్తున్నారు. వీరు బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్స్. అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని బైక్‌పై తరలించే ప్రయత్నం చేశారు. కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825 వద్ద ఏజెంట్లు డబ్బు కలెక్ట్ చేసుకున్నారు. అయితే వీరిని ముందుగానే గమనించిన దుండగులు మూడు బైక్‌లపై ఫాలో అయ్యారు. డబ్బు కలెక్ట్ చేసుకుని కేవలం 100 మీటర్ల దూరం ప్రయాణించగానే.. నలుగురు దుండగులు స్కూటీపై వెళ్తున్న వారిపై కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కింద పడిపోగా.. వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుని దుండగులు పరారయ్యారు. ఈ ఘటనలో ఉపయోగించిన బైక్‌లు ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్స్‌గా పోలీసులు గుర్తించారు. డబ్బు హవాలా నగదై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే డబ్బు తరలింపు సమాచారం ముందుగానే తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరిది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక నిర్ణయం

**- విచారణకు సిట్ ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వం ఆదేశం**

**- చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు**

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ వ్యవహారంపై సిట్ విచారణ చేయనుంది. దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై సిట్ విచారణ జరపనుంది. ఈ డ్రగ్స్ కేసులో వీటిని ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు? ఈ పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు ఎవరు? వారికి మీకు ఉన్నా లింకులు, దుబాయ్ లింకులు తదితర అంశాలపై పలు కోణాల్లో విషయాలను రాబట్టేందుకు ఈ సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి సిట్ నివేదికను అందించనుంది. మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌పై ఆదివారం పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ.. కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. వారిలో పలువురికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సైతం ఉన్నారు. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరికి వారి వారి పార్టీల నుంచి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలంటూ వారికి ఆయా పార్టీలు స్పష్టం చేశాయి. అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాయి.

# అరటి ఎగుమతులు ఢమాల్

**- దేశయంగా ముందుకు రాని కొనుగోలుదారులు**

**- ఆందోళనలో జిల్లా అరటి రైతులు**

**అనంతపురం,మార్చి17( వెలుతురు):**
పశ్చిమ దేశాల్లో కొనసాగుతున్న యుద్ధంతో అరటి రైతులు కుదేలవుతున్నారు. ఎగుములు ఆగి, ధరలు పడిపోవడంతో పలు చోట్ల అరటి రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. 20 రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పడిపోయింది. కిలో రూ.5కు కూడా కొనే నాథుడు కరువవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి సాగు గణనీయంగా ఉంది. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు 47 వేల ఎకరాల్లో ఈ ఏడాది అరటి సాగైంది. ఫిబ్రవరిలో కిలో రూ.22 నుంచి రూ.24 వరకు ధర పలికింది. వారం రోజులుగా అరటిపై యుద్ధం నీడలు కమ్ముకోవడంతో ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతదో తోటల్లోనే అరటి కాయలు వాడిపోతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగు, కోత కూలి కలుపుకొని సుమారు రూ.1.40 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు లక్ష రూపాయలు మాత్రమే వచ్చే అవకాశముంది. అది కూడా



మొదటి పంట అయితేనే ఈ ధర వస్తుంది. పంట కొనుగోలుకు వ్యాపారి వస్తేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే ఎండ తీవ్రతకు నెల రోజుల్లో గెలలు నేలకొరిగే ప్రమాదం ఉంది. రెండు, మూడో ఏడాది పంటను అడిగేవారు కరువయ్యాడు. మైక్రోసన్ అరటిని సాగు చేసిన వారి పొలాల్లో పంట కోత దశలో నాణ్యతగా ఉంది. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. వారం ముందు వరకు వ్యాపారులు టన్ను రూ.20 వేలకు అడిగారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేస్తే ధర పడిపోయిందంటూ టన్ను ఐదు వేల రూపాయలకు కూడా కొనుగోలుకు ముందుకురావడం లేదని వాపోతున్నారు. పంట కోయకపోతే గెలలు నేలకొరిగిపోయి పూర్తిగా నష్టపోతామని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# రోహిత్ రెడ్డి వ్యవహారంపై బిఆర్ఎస్ సీరియస్

**- షాకాజ్ నోటీసులు జారీచేసిన గులాబీ పార్టీ**

**- వారంలోగా సవివరమైన వివరణ ఇవ్వాలని ఆదేశం**

**- లేకుంటే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరిక**

**హైదరాబాద్,మార్చి17( వెలుతురు):**
మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ బిగ్ షాక్ ఇచ్చింది. రోహిత్‌కు పార్టీ అధిష్ఠానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ కేసుకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. 'డ్రగ్స్ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు మీడియా ద్వారా వార్తలు వచ్చాయి. అదే విధంగా పోలీస్ కేసు నమోదు అయిన నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి నోటీసులు జారీ చేసినట్లు' నోటీసుల్లో పేర్కొంది. ఈ వ్యవహారం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని రోహిత్ రెడ్డికి పార్టీ ప్రధాన కార్యదర్శి పేరుతో నోటీసులు జారీ అయ్యాయి. ఈ అంశంపై ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ ఆదేశించింది. గడువులోపు సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోతే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని పార్టీ అధిష్ఠానం హెచ్చరించింది. ఇకపోతే పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారాన్ని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లోగా స్పష్టంగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. షోకాజు నోటీసుకు గడువులోపు వివరణ సమర్పించకపోతే.. పార్టీ నియమావళి ప్రకారం వేటు వేస్తామని హెచ్చరిం చారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా వ్యవహారాల బాధ్యులు సోమ భరత్ కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో హాజరైన సమయంలో, అక్కడ మాదక ద్రవ్యాలు వినిగియోంచారని వివిధ మీడియా నివేదికలు, ఇతర విశ్వసనీయ సమాచారం ద్వారా పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి వచ్చిందని షోకాజ్ నోటీసుల్లో తెలిపారు. ఈ వార్తలు




విస్తృతంగా మీడియాలో ప్రసారం కావడంతో పాటు పార్టీకి, ప్రజల్లో కూడా తీవ్ర ఆందోళనలు కలిగించాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలు పాటించడంలో విశ్వాసం కలిగిందని నోటీసుల్లో పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదకద్రవ్యాలు, మత్త పదార్థాల వినియోగం లేదా వాటితో ఏ విధమైన సంబంధం కలిగి ఉండటాన్ని బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ సంఘటనలో పైలర్ రోహిత్ రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణలు పార్టీకి తీవ్రమైన అపకీర్తిని తెచ్చిపెట్టాయని అన్నారు. అలాగే పార్టీ ప్రతితష్ఠ, విశ్వసనీయతకు భంగం కలిగించే అవకాశాలు కల్పించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశం మేరకు ఈ నోటీసులు అందిన తేదీ నుంచి 7 రోజుల్లోపు మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై జవాబును స్పష్టంగా వివరిస్తూ సమగ్రంగా లిఖితపూర్వక వివరణ సమర్పించాల్సిందిగా నోటీసులు ద్వారా ఆదేశిస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై పార్టీ నాయకత్వం సమగ్రంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలు, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఉండాల్సిందిగా ఆదేశించారు. గడువు తేదీలోగా సంతృప్తికరమైన వివరణ సమర్పించకపోతే పార్టీ రాజ్యాంగం, నియమావళి ప్రకారం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే మీపై తగిన క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## ఆస్తిపన్ను చెల్లింపుదారులకు
# శుభవార్త


**- వడ్డీలో 50శాతం రాయితీ కల్పించిన ఏపి ప్రభుత్వం**




**అమరావతి,మార్చి17( వెలుతురు):**
మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఆస్తి పన్ను బకాయిలు పెరిగిపోయిన నేపథ్యంలో బకాయిల వసూలు కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీవో నెంబర్ 58ని విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 31 తేదీలోగా బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుంది. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించిన వారికి తదుపరి బిల్లులో ఆ మినహాయింపు మొత్తాన్ని సర్దుబాటు చేసి ఇస్తామని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు.

# ఇటానరగ్‌లో విరిగిపడ్డ కొండచరియలు

**- గోడకూలి నలుగురు మృత్యువాత**



**ఇటానగర్,మార్చి17( వెలుతురు):**
కొండచరియలు విరిగిపడడంతో గోడ కూలి నలుగురు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయని ఇటానగర్ అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం సాయంత్రం ఇటానగర్‌లో నీతి బీహార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారిని చోకి తసర్, రతన్ బర్మాన్, గోడక్ రాజా, గోడక్ టాబిన్‌లుగా అధికారులు గుర్తించారు. నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. రెస్క్యూ బృందం ఘటనా స్థలం నుంచి నాలుగు మృతేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు అని ఇటానగర్ ఎస్పి జుమార్ బసర్ మీడియాకు వెల్లడించారు.


# దత్తత తీసుకున్నా..3 నెలల సెలవులు ఇవ్వాల్సిందే

**- పితృత్వ సెలవులపైనా నిర్ణయం తీసుకోవాల్సిందే**

**- పిల్లల పెంపకంలో తండ్రులకు కూడా భాగస్వామ్యం**

**- ప్రసూతి సెలవుల విచారణలో సుప్రీం కీలక ఆదేశాలు**

**న్యూఢిల్లీ,మార్చి17( వెలుతురు):**
ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న బిడ్డను ఒక మహిళ దత్తత తీసుకుంటే.. ఆమెకు ప్రసూతి సెలవులను నిరాకరించడం సరికాదని తీర్పులో పేర్కొంది. ఆ బిడ్డ వయసుతో సంబంధం లేకుండా ఆ తల్లికి 12 వారాల సెలవు పొందడానికి అర్హత ఉంటుందని స్పష్టం చేసింది. దత్తత వంటి మార్గాల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం చట్టబద్ధమేనని వ్యాఖ్యానించింది. దత్తత తీసుకున్న బిడ్డకు కన్నబిడ్డకు మధ్య ఎలాంటి వ్యత్యాసం ఉండదు. ప్రసూతి సంరక్షణ కనీస హక్కు అని పేర్కొంది. మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్ ప్రకారం.. 3 నెలల కంటే తక్కువ వయసు ఉన్న బిడ్డను దత్తత తీసుకునే మహిళా ఉద్యోగులు 12 వారాలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవు తీసుకోవడానికి అర్హత ఉంది. ఈ క్రమంలో పితృత్వ సెలవులపై ప్రత్యేక చట్టం




తీసుకురావాలని కేంద్రానికి సుప్రీంకోర్టు తాజాగా సూచించింది. పిల్లలు, వారి తల్లిదండ్రుల అవసరాలకు అనుగుణంగా సెలవులను నిర్ణయించాలని పేర్కొంది. మాతృత్వ సెలవులపై కేసులో విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మంగళవారం పితృత్వ సెలవులపై కూడా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తండ్రులకు కూడా సెలవులు ఉండాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. పిల్లల పెంపకం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని పేర్కొంది. తండ్రికి కూడా సమాన బాధ్యత ఉంటుందని తెలిపింది. మాతృత్వ సెలవుల తరహాలోనే.. వేతనంతో కూడిన పితృత్వ సెలవులు కల్పించాలని సూచించింది. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష తగ్గాలంటే ఇలాంటి చట్టాలు అవసరమని సుప్రీంకోర్టు పేర్కొంది. పితృత్వ సెలవులు ప్రైవేట్ రంగంలోనూ అమలు చేసేలా నిబంధనలు రూపొందించాలని కేంద్రానికి సూచించింది. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇక మూడు నెలలలోపు వయసున్న పిల్లల్ని దత్తత తీసుకున్న మహిళలకు మాత్రమే 12 వారాల మాతృత్వ సెలవులను కేటాయించడం సరికాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఈ మేరకు సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లోని నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. దత్తత తీసుకున్న పిల్లల వయసుతో సంబంధం లేకుండా తల్లులకు 12 వారాల మాతృత్వ సెలవులు మంజూరు చేయాలని స్పష్టం చేసింది.

# ఘజియాబాద్‌లో దారుణ ఘటన

**- బ్యాంక్ మేనేజర్‌రు కాల్చి చంపిన సెక్యూరిటీ గార్డ్**

**న్యూఢిల్లీ,మార్చి17( వెలుతురు):**
ఘజియాబాద్‌లో ఓ సెక్యూరిటీ గార్డు ఘాతుకానికి పాల్పడ్డాడు. సెలవులు, జీతం విషయంలో విభేదాలు రావడంతో అందరూ చూస్తుండగా బ్యాంక్ మేనేజర్‌ను కాల్చి చంపాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఘజియాబాద్‌లోని పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో రవీంద్ర హుడా అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడికి సెలవుల గురించి తరచుగా బ్యాంక్ మేనేజర్ అభిషేక్ కుమార్ (34)తో విభేదాలు తలెత్తుతుండేవి. ఎప్పుడు అడిగినా మేనేజర్ సెలవు తిరస్కరిస్తుండడంతో అతడిపై రవీంద్ర తీవ్రంగా కోపం పెంచుకున్నాడు. సోమవారం రాత్రి అభిషేక్ క్యాబిన్‌లోకి వెళ్లిన రవీంద్ర, తుపాకీతో అతడిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన అభిషేక్‌ను ఇతర సిబ్బంది హాస్పిటల్‌కు తరలించారు. అయితే అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు వెంటనే రవీంద్రను అదుపులోకి తీసుకున్నారు. మేనేజర్ హత్యలో రవీంద్రకు సహకరించిన శిశుపాల్‌ను



కూడా అరెస్ట్ చేశారు. తాను ఎప్పుడు లీవ్ అడిగినా మేనేజర్ నిరాకరించేవాడని, బ్యాంక్‌కు రాని రోజును సెలవుగా పరిగణించకుండా జీతం కట్ చేసేవాడని, ఆ కోపంతోనే అతడిని కాల్చి చంపానని పోలీసుల విచారణలో రవీంద్ర తెలిపాడు. సెలవుల విషయంలో మేనేజర్‌తో తరచుగా తనకు గొడవలు జరుగుతుండేవని చెప్పాడు. తాను కాల్పులు జరిపిన సమయంలో స్నేహితుడు శిశుపాల్ పక్కనే ఉన్నట్టు కూడా పోలీసుల విచారణలో రవీంద్ర చెప్పాడు. ఆర్మీలో పని చేసి 2018లో రిటైర్ అయిన రవీంద్ర బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా జాయిన్ అయ్యాడు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com